త్వరలో మెస్ సమస్యకు పరిష్కారం

ఇంటర్వ్యూ..

- విద్యార్థులకు యూనిఫాం, ల్యాప్‌టాప్‌లు అందిస్తాం
- ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్



-9లో

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు శనివారం నుంచి ప్రారంభం కానుంది. అన్ని నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, కన్వీనర్లు, మంత్రులు, ఎంపీలు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారి సమక్షంలో ఈ కార్యక్రమం ఆరంభమవుతుంది. రెండేళ్లకోసారి జరిగే ఈ సభ్యత్వ నమోదులో ఈసారి నియోజకవర్గాల వారీగా పెద్ద సంఖ్య లో జరగాలని పార్టీ నాయకత్వం ఆశిస్తోంది. ప్రత్యేకించి నియోజక వర్గాల వారీగా ఎలాంటి ఆంక్షలు, లక్ష్యాలు నిర్దేశించకుండానే సిట్టింగ్ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజక వర్గ కన్వీనర్లు సాధ్యమైనంత మేర ముందుకు సాగాలనేది ఆ పార్టీ ఆదేశం. ఇప్పటికే నియోజక వర్గాల వారీగా పార్టీ నేతలు అందరితోను ముందస్తు సమీక్ష చేశారు. సాధ్యమైనంత మేర అత్యధిక సంఖ్యలోనే ఈ ప్రక్రియ సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఇంతకు ముందు బీమా సౌకర్యం రూ.రెండు లక్షలు ఉండగా, ఇప్పుడది రూ.ఐదు లక్షలకు పెంచారు. సభ్యత్వం తీసుకుని ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే వారికి ఈ స్థాయిలో బీమా లభిస్తుంది. విద్యా, వైద్యంలోను పార్టీపరంగా ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సభ్యత్వం తీసుకున్న వారంతా తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు టీడీపీలో చేరే విధంగా ప్రోత్సహించాలని నిర్దేశించారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి : కలెక్టర్



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ కిశోర్

ఏలూరుసిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ రోజున ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి బాణసంచా దుకాణాల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనలపై సంబంధిత అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'సంబంధిత శాఖలు మంచి సమన్వయంతో పని చేయాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు, ప్రభుత్వం జారీ చేసిన విధి విధానాలకు అనుగుణంగా నిబంధనలు పక్కాగా పాటిస్తూ బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలి. గ్రామ స్థాయిలో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి' అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా మందుగుండు సామాగ్రి తయారు చేసినా, నిల్వచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా ఫైర్ అధికారి రత్న బాబు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎస్పీ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ డిపో ఏమైంది..!



నేవీ ఆయుధ డిపోకు వంకవారిగూడెం వద్ద ప్రతిపాదించిన ప్రాంతం

ఏడాది క్రితం ఏజెన్సీలో నేవీ ఆర్భాటం అంతా ఇంతా కాదు. అవునన్నా.. కాదన్నా ఈ ప్రాంతంలోనే ఆయుధ డిపో ఏర్పాటుకు వీలుగా భూసేకరణకు యత్నాలు సాగాయి. దీంతో ఆ ప్రాంత గిరిజనం బావురమంటూ రోడ్డెక్కారు. ఆపై ఏడాదిగా అంతా సైలెంట్. కాని కొద్ది రోజుల్లోనే డిపో ఏర్పాటుకు వీలుగా చురుకైన చర్యలు ఆరంభిస్తారని తెలుస్తోంది.

- ఏడాది క్రితమే జీలుగుమిల్లిలో నేవీ ఆర్భాటం.. గుట్టుగా భూసర్వే
- రోడ్డెక్కిన గిరిజనం..
- అప్పటి నుంచి అంతా సైలెంట్..
- ఎంపీ పుట్టా వ్యాఖ్యలతో మళ్లీ జీవం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం పరిసర ప్రాంతాల్లోనే ఈ ఆయుధ డిపో ఏర్పాటుకు అనువుగా సుమారు 1166 ఎకరాల్లో అనువైన పరిస్థితులు ఉన్నాయా, లేవా అని తెలుసుకునేందుకు గుట్టుగా అధికారులు రంగంలోకి దిగారు. నేవీకి సంబంధించి సర్వే అధికారులు తమవంతుగా భూమి అంచనాకు సిద్ధపడ్డారు. స్థానిక అధికారులిది కేవలం ప్రేక్షకపాత్ర వహించారు. గతేడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో ఈ హడావుడి అంతా సాగింది. వాస్తవానికి వంకవారిగూడెంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి భూమికి భూమి కింద కేటాయించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్దేశించింది. అయినప్పటికి జీలుగుమిల్లిలోని ఈ ప్రాంతం ఒక వైపు రోడ్డు రవాణాకు, భవిష్యత్తులో నిర్మించే రైల్వే మార్గానికి అత్యంత అనువుగా ఉండడమే కాకుండా ఇంకోవైపు తెలంగాణ వైపు ముందుకు సాగేందుకు అనుకూల పరిస్థితులు ఉండడం నేవీ పరిగణనలోకి తీసుకుంది. ఈ కారణంగానే వంకవారిగూడెంలో అయితే తగినంత భూమి ఉన్నట్టుగా నిర్ధారించుకుని మరీ గుట్టుగా రంగంలోకి దూకింది. స్థానికులు అప్పట్లోనే ఆయుధ డిపో వ్యవహారాన్ని వ్యతిరేకించారు. అప్పట్లో అధికారంలో ఉన్న స్థానిక ఎంపీ కోటగిరి శ్రీధర్‌తోను నేవీ అధికారులు జీలుగుమిల్లి ప్రాంతమే ఆయుధ డిపోకు అనువైన ప్రాంతంగా వివరించారు. అయితే ఈ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్న గిరిజన, గిరిజనేతర వర్గాలన్నీ అప్పట్లో ఎంపీకి మొరపెట్టుకున్నాయి. తమ ప్రాంతంలో ఆయుధ డిపో పెట్టవద్దని, స్థానికుల రాకపోకలపై ఆంక్షలు అమలవుతాయని మొరపెట్టుకున్నారు. పోలవరం ప్రాజెక్టుకు తమ భూములను ఇచ్చి ఒకప్పుడు నష్టపోయామని, మళ్ళీ తిరిగి తమకు ఈ ప్రాంతంలో భూమికి భూమి కింద తగినంత భూమి ఇచ్చేందుకు నిర్మించిన కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలోనే ఈ ప్రాంతంపై నేవీ కన్ను పడడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎందుకంటే వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో మడకవారిగూడెం, దాట్లవారిగూడెం, వంకవారిగూడెం, కొత్త సీమలివారిగూడెం, రమణక్కపేట అనే ఐదు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో నివసిస్తున్నది గిరిజన కుటుంబాలే.

నిర్మాణం ఆరంభిస్తే..

వాస్తవానికి అత్యంత భద్రతతో కూడిన నేవీ ఆయుధ డిపోను నిర్మించదలిస్తే కేవలం మూడేళ్ల వ్యవధిలోనే అంతా పూర్తవుతుందని అప్పట్లోనే అధికారిక సమాచారం వెలువడింది. కాని స్థల సేకరణలోనే అప్పట్లో జంగారెడ్డిగూడెం ఆర్డీవో, స్థానిక తహసీల్దార్‌కు మాత్రమే క్లుప్తంగా సమాచారం అందించారు. ఆ తర్వాత నేవీకి సంబంధించిన సర్వేయర్లు తమకు అవసరమైన 1100 ఎకరాల భూభాగాన్ని అత్యంత ఆధునాతన సాంకేతిక పద్ధతుల్లో సర్వే చేశారు. అయితే నేవీ తన ప్రతిపాదనలను ఎందుకు అమలులోకి తేలేకపోయిందనేదే ఇప్పుడు అందరి ప్రశ్న. జీలుగుమిల్లి మండలంలోని గిరిజన కుటుంబాలు కేవలం తమ ఆందోళనను దృష్టిలో పెట్టుకుని నేవీ వెనక్కి మళ్ళిందని కొంత సంతృప్తిపడగా, తాజాగా ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ నేవీ ఆయుధ డిపో పోలవరం నియోజకవర్గంలోనే రాబోతుందని, కేంద్రం సైతం సానుకూలంగానే ఉన్నట్టు ప్రకటించారు. దీంతో మరో మారు ఆయుధ డిపో వ్యవహారం తెరముందుకు వచ్చింది. గతంలో చేసిన ఏపీలోని ప్రతిపాదనల్లో కొన్నింటిని ఆమోదించేందుకు కేంద్రం సంసిద్ధంగా ఉన్నట్టు ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. దీనిలో భాగంగానే జీలుగుమిల్లి మండలంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు అధికారికంగా సంకేతాలు ఇచ్చే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు. అయితే స్థానిక అధికారులు గతంలో ఏమి జరిగిందో తమకు నామమాత్రంగా కూడా నేవీ నుంచి సమాచారం లేదంటున్నారు. తాజాగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పొరుగునే సత్తుపల్లి- కొవ్వూరు రైల్వేలైను నిర్మాణానికి అనువైన పరి స్థితులు ఉండడంతో నేవీడిపో ప్రతిపాదనకు పూర్తిగా జీవం వచ్చినట్టేనని ఇంకొందరు భావిస్తున్నారు. కాని స్థానికంగా ఉన్న గిరిజనులు ఈ తరహా డిపో ఏర్పాటుతో ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతం కకావికలం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి జీఎంగా సుబ్రహ్మణ్యేశ్వరరావు

ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి జీఎంగా వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతనెలలో జరిగిన బదిలీల్లో జిల్లాకు రెగ్యులర్ జీఎంగా తిరుపతి నుంచి ఇక్కడకు నియమితులైన ప్రతాప్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వ్యక్తిగత కారణాలపై సెలవులో ఉండగా ఆ మేరకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ డైరెక్టర్‌గా వున్న సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎఫ్ఏసీ హోదాలో జీఎంగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా నవంబరు మొదటివారం నుంచి స్థానిక సచివాలయాల సిబ్బంది సహకారాన్ని తీసుకుని కుటీర పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలపై సర్వే నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు.



పొలాల్లో గాలిస్తున్న అటవీ శాఖాధికారులు

కానరాని చిరుత ఆచూకీ

రెండోరోజు కొనసాగిన గాలింపు

పెదవేగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం జగన్నాథపురంలో చిరుత పులి ఆచూకీ కోసం రెండోరోజూ శుక్రవారం గాలింపు చర్యలు కొనసాగించారు. జగన్నాథపురం, కవ్వగుంట గ్రామాల మధ్య తోటల్లో అటవీశాఖాధికారులు విస్తృతంగా గాలించారు. కానీ ఎక్కడా చిరుత ఆనవాళ్లు కనిపించలేదు. గురువారం రాత్రంతా అటవీశాఖ సిబ్బంది బృందాలుగా గ్రామంలో గస్తీ తిరిగారని, శుక్రవారం రాత్రి కూడా బృందాలు గస్తీ తిరుగుతాయని ఏలూరు రేంజ్ అటవీశాఖాధికారి ఎస్‌వీకే.కుమార్ తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సాధారణంగా చిరుత రాత్రి సమయంలో వేగంగా కదులుతుంటుందని, చిరుత అడుగు జాడలు కూడా కనిపించలేదన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో చిరుత సంచారంపై అవగాహన కల్పించామన్నారు. గ్రామస్థులు ఒంటరిగా బయట తిరగవద్దని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. చిరుత కనిపిస్తే దానిని బెదిరించకుండా తక్షణం సమాచారం అందించాలన్నారు.

జిల్లాలో పశుగణన ప్రారంభం

పశుసంవర్ధక శాఖ జేడీ

ఏలూరు టూటౌన్, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా వ్యాప్తంగా అఖిల భారత పశుగణన కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభించినట్టు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. జిల్లాలోని 27 మండలాల్లో 227 మంది ఇన్యూమరేటర్స్, 53 మంది సూపర్ వైజర్లు, పశుగణనలో పాల్గొన్నారన్నారు. జిల్లాలో 5,25,000 గేదెలు, లక్షా 40 వేలు ఆవులు, 5,12,000 గొర్రెలు, 2,30,000 మేకలు, 80 వేల పెంపుడుకోళ్ళు ఉన్నాయన్నారు. వీటన్నిటి వివరాలు ఆన్‌లైన్‌లో సిబ్బంది నమోదు చేస్తారన్నారు. ఇవి కాక గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, ఏనుగులు, కుక్కలు, పందులు, కుందేళ్ళు బాతుల వివరాలను కూడా గణన చేసి ఆన్‌లైన్ చేస్తామన్నారు. ప్రతీ ఐదేళ్లకు జరిగే పశుగణన గతంలో 2019లో జరిగిందన్నారు. ప్రస్తుతం చేపట్టిన పశుగణన 2025 ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. సిబ్బంది వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని కోరారు.

ఐదుగురు హెచ్‌ఎంలకు మెమోల జారీ

ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఇటీవల నిర్వహించిన ఆరురోజుల శిక్షణ తరగతులకు గైర్హాజరైన ఐదుగురు హెచ్‌ఎంలకు పాఠశాల విద్య ఉన్నతాధికారులు మెమోలు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు పెంచేందుకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ఇందులో భాగంగా ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అగిరిపల్లిలోని 'హీల్' విద్యాసంస్థలో విడతలవారీగా శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత రాష్ట్రస్థాయి రీసోర్స్ పర్సన్లకు శిక్షణనిస్తే, వీరంతా జిల్లాల్లోని మిగతా హెచ్‌ఎంలకు శిక్షణనివ్వాలి. ఒక్కో విడతకు 200 మంది హెచ్‌ఎంలు చొప్పున ఆరురోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఏలూరు జిల్లా నుంచి రాష్ట్రస్థాయి రీసోర్స్ పర్సన్లుగా మొత్తం 16 మంది హెచ్‌ఎంలను 'టిస్' డేటా మేరకు ఉన్నతాధికారులు ఎంపికచేసి, ఈ నెల 14నుంచి 19 వరకు నిర్వహించిన రెసిడెన్షియల్ శిక్షణ నిమిత్తం అగిరిపల్లికి పంపాల్సిందిగా జాబితాను జిల్లా విద్యాశాఖకు పంపారు. ఇందులో ఐదుగురు గైర్హాజరు కావడంతో రెండురోజుల క్రితం మెమోలు జారీ చేశారు. జాబితాలోని నలుగురికి తీవ్ర అనారోగ్యం ఉండడంతో డీఈవో అనుమతి తీసుకుని వారిస్థానంలో ప్రత్యామ్నాయంగా మరో నలుగురిని పంపినట్టు చెబుతున్నారు. అయినా మెమోలు జారీ చేయడం వెనుక సమగ్రశిక్ష 'సీమ్యాట్' అధికారి అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని, ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి కొందరు హెచ్‌ఎంలు సమాయత్తమవుతున్నట్టు సమాచారం.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి

- ఎంపీ పుట్టా మహేశ్



రహదారి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే పత్సమట్ల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

నిడమర్రు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించడం తమ కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని చిన నింద్రకొలను నుంచి తోకలపల్లి వరకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.కోటి వ్యయంతో చేపట్టే రహదారి పనులకు శుక్ర వారం ఆయన ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి శంకుస్థాపన చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి, పోలవరం ప్రాజెక్టు తదితర పనుల పూర్తి చేస్తామన్నారు.

గ్రంధి సైకిలెక్కుతారా ?

టీడీపీ అధిష్ఠానంతో మంతనాలంటూ రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం

- బుజ్జగిస్తున్న వైసీపీ అధిష్ఠానం.. మాజీ మంత్రులు కారుమూరి, పేర్ని నాని మంతనాలు
- జగన్ పట్టించుకోలేదంటూ మాజీ ఎమ్మెల్యే ఘాటు స్పందన
- పెద అమిరంలో ముఖ్యనేతల జిల్లా సమావేశం.. గ్రంధి గైర్హాజర్



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వైఖరి వైసీపీ అధిష్ఠానానికి మింగుడు పడడం లేదు. ఎన్నికల అనంతరం ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరోవైపు తెలుగుదేశం పార్టీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కూటమిలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం గ్రంధి నివాసానికి మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, పేర్ని నాని వెళ్లి మంతనాలు సాగించారు. గతంలోనూ ఇటువంటి ప్రయత్నాలు చేశారు. ఒక దశలో మాజీ సీఎం జగన్ ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించారు. ఇవేమీ ఫలితాలు ఇవ్వలేదు. తాజాగా కారుమూరి, నాని భేటీలోనూ గ్రంధి శ్రీనివాస్ ఘాటుగా స్పందించినట్టు సమాచారం. వైసీపీ అధినేత జగన్ వైఖరిని ఎండగట్టినట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు ఐదు నిమిషాలపాటు ఇంటర్వ్యూ కూడా ఇవ్వలేదన్న ధోరణిలో జగన్‌పై ఘాటు వ్యాఖ్యలు చేసినట్టు పార్టీలో గుప్పుమంది. ఎన్ని పర్యాయాలు వైసీపీ ముఖ్య నేతలు సంప్రదిస్తున్నా ఆయనలో మార్పురాలేదు. పెద అమిరంలో శుక్రవారం జిల్లా ముఖ్యనేతలు సమావేశమయ్యారు. దీనికి గ్రంధి హాజరు కాలేదు. సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపి, ఎమ్మెల్సీ కవురు కవురు శ్రీనివాస్, గూడూరి ఉమాబాల తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. సమావేశానికి గ్రంధి హాజరు కాలేదు. గతంలో జగన్ జిల్లా నేతలతో నిర్వహించిన భేటీకి దూరంగా ఉన్నారు.

గ్రంధి వర్గం మౌనం

గ్రంధికి అనుకూలంగా వున్న వైసీపీ నాయకులు ఇప్పుడు మౌనం పాటిస్తున్నారు. ఆయన బాటలో పయనించాలని చూస్తున్నారు. వాస్తవానికి పవన్‌కల్యాణ్‌ను 2019లో ఓడించిన తనకు మంత్రి పదవి లభిస్తుందని ఆశించారు. జగన్‌పై నమ్మకం పెట్టుకున్నారు. తీరా మంత్రి పదవిలో స్థానం లభించకపోవడంతో ఒక దశలో జగన్‌కి తనపై అభిమానం లేదని వ్యాఖ్యానించారు. ఇదే తనను బాధిస్తోందని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన తర్వాత గ్రంధి రాజకీయ ప్రస్థానంలో మార్పులు కనిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. కేడర్‌తో సమావేశాలు ఏర్పాటు చేయలేదు. మరోవైపు తన మిత్రుల ద్వారా టీడీపీ అధిష్ఠానంతో మంతనాలు సాగిస్తున్నట్టు కూటమి పార్టీల్లోను, వైసీపీలోనూ ప్రచారం సాగుతోంది. భీమవరంలోని కొందరు టీడీపీ నాయకులు గ్రంధి రాకను స్వాగతించేలా అధిష్ఠానానికి సంకేతాలు పంపారంటూ చర్చ నడుస్తోంది. ఈ తరుణంలోనే వైసీపీ ముఖ్య నాయకులు గ్రంధి ఇంటికి వెళ్లి మంతనాలు సాగించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయినా మాజీ మనసు మారలేదు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా అసంతృప్తి ఉంటే కొత్త వారికి పగ్గాలు ఇస్తోంది. భీమవరంలో మంతనాలు సాగిస్తూ గ్రంధి నాయకత్వాన్ని కోరుకుంటున్నట్టు కనపడుతోంది. ఇప్పటి వరకు లోలోన అసంతృప్తి వెళ్లగక్కుతున్న మాజీ ఎమ్మెల్యే పార్టీపైనా, జగన్‌పైనా బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. నాయకుల వద్ద మాత్రం తన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెల 11 వరకు 'పది' పరీక్ష ఫీజు చెల్లింపు గడువు

ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించడానికి నవంబరు 11 వరకు గడువు ఉందని డీఈవో అబ్రహం శుక్రవారం తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో నవంబరు 30వరకు చెల్లించ వచ్చని ఆయన వివరించారు. నామినల్ రోల్స్ అన్ని ధ్రువ పత్రాలను బీఎస్ఈ వెబ్‌సైట్‌లో సబ్మిట్ చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

14న టీచర్, పేరెంట్స్ మీటింగ్

జిల్లాలోని విద్యార్థులందరికీ 'అపార్' (ఆటో మేటిడ్ పర్మినెంట్ అకడమిక్ అక్కౌంట్ రిజిస్ట్రీ) సంఖ్యల నమోదు ప్రక్రియ వేగవంతం చేయడానికి చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం కలెక్టర్లతో పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి కె.శశిధర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అపార్ ఐడీలు, మెగా డీఎస్సీకి కేడర్, పోస్టులవారీగా రిజర్వేషన్ రోస్టర్ పాయింట్ల ఖరారు, నవంబరు 14న పాఠశాలల్లో టీచర్-పేరెంట్స్ మీటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించారు. డీఎస్సీకి రిజర్వేషన్ల రోస్టర్ పాయింట్లను ఈ నెల 28వతేదీ సాయంత్రంలోగా తుది నివేదికను పంపాలని కోరారు.



పెదలంక డ్రెయిన్ మార్జిన్‌లో అక్రమ రొయ్యల చెరువు

ఆక్రమణల చెరలో..

- పెదలంక డ్రెయిన్ మార్జిన్‌లను ఆక్రమించి చెరువుల సాగు
- లక్ష ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం
- దట్టంగా ఇరువైపులా కిక్కిస
- గరిశపూడి అండర్ టన్నెల్ వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలంటూ రైతుల విజ్ఞప్తి

కలిదిండి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాల్లో విస్తరించి ఉన్న పెదలంక డ్రెయిన్ మార్జిన్‌ను ఇరువైపులా కొంతమంది ఆక్రమించుకుని చేపలు, రొయ్యల చెరువులు తవ్వడంతో పెదలంక డ్రెయిన్ ఉనికిని కోల్పోతోంది. కృష్ణా జిల్లా కృత్తివెన్ను, బంటుమిల్లి, ఏలూరు జిల్లా కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో పెదలంక డ్రెయిన్ విస్తరించి ఉంది. ఈ డ్రెయిన్‌పై ఆధారపడి సుమారు లక్ష ఎకరాలు సాగు అవుతోంది. ప్రస్తుతం పెదలంక డ్రెయిన్‌లో దట్టంగా కిక్కిస, గుర్రపు డెక్క పేరుకుపోయింది. భారీ వర్షాలు కురిసినప్పుడు పెదలంక డ్రెయిన్ నీరు ఎగదన్నడంతో వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయి. రెండేళ్లుగా పెదలంక డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టక ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. డ్రెయిన్ వెంబడి మార్జిన్‌లో చేపల రొయ్యల చెరువులు తవ్వడంతో పెదలంక డ్రెయిన్ కుదించుకుని పోతోంది. డ్రెయినేజీ అధికారులు అక్రమ చెరువులను తొలగించినా మళ్లీ వాటిని తవ్వి చేపలు, రొయ్యల సాగు యథావిధిగా చేస్తున్నారు. గరిశపూడి అండర్ టన్నెల్ సమీపంలోని సముద్రంలో పెదలంక డ్రెయిన్ కలుస్తోంది. అమావాస్య పోటు ఎక్కు వగా ఉండడంతో ఉప్పునీరు పెదలంక డ్రెయిన్‌లో ఎగదన్నుతుంది. దీంతో సంవత్సరంలో ఆరు నెలలు ఉప్పునీరే ఉండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఉప్పునీటి నివారణకు గరిశపూడి అండర్ టన్నెల్ వద్ద రెగ్యులేటర్ నిర్మించాలని పాలకులకు, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రెగ్యులేటర్ ఏర్పాటు చేస్తే వేలాది ఎకరాల్లో పంట చేతికి వస్తుం దని ముంపు బెడద ఉండదని చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధి కారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రెగ్యులేటర్‌ని నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



పెదలంక డ్రెయిన్‌లో దట్టంగా కిక్కిస

వాతావరణం అనుకూలిస్తే పాపికొండలకు ఓకే



8

ఒకప్పుడు జైలు.. ఇప్పుడు స్కూలు

ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన పాఠశాల

వైవిధ్యం వీరి జీవనం

- అత్యంత నియమబద్ధం.. జైనుల సంప్రదాయం
- సూర్యోదయానికి ముందే సమస్త పూజలు
- తర్వాతే అన్నపానీయాలు

జైన సంప్రదాయాలు, ఆలయాలపై ప్రత్యేక కథనం. 8లో..

అన్నీ వదులుకుని గురువులా జీవనం..

జైన్లలో చాలామంది యుక్త వయసులోనే గురువులుగా మారు తుంటారు. ఇది చాలా కఠిన తరం, పురుషులను సాధవులని, స్త్రీలను సాధవి అని సంబోధిస్తారు, గురువులుగా మారే వారు కోరికలు, వ్యామోహాలు, రాగద్వేషాలను విడిచి పెట్టాలి. ఒకసారి గురువుగా మారితే మళ్లీ కుటుంబ సభ్యులతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోకూడదు. వీటికి కూడా చాలా మతాలు ఉంటాయి. నచ్చిన గురువును ఎంచుకుని మఠంలో చేరాలి. అక్కడ వీరి చేత ఆగమాలు, ధార్మికత గురించి చదివిస్తారు. నేల మీదే పడకోవాలి. వాహనాలు ఎక్కకూడదు. ఎక్కడికి వెళ్లినా నడకే. అన్నీ వదులుకుని గురువులుగా మారే వారిని జైన్లు ఎక్కువగా గౌరవిస్తారు. వారు ఊరుకు వస్తున్నారంటే ఎదురెళ్లి స్వాగతం పలికుతారు. వారి బోధనలను భక్తి శ్రద్ధలతో ఆలకిస్తారు.



గురువులుగా మారిన జైన యువకులు (ఫైల్‌ఫొటో)



నరసాపురం ప్రార్థన మందిరంలో బోధనలు వింటున్న భక్తులు

కల్చర్

వైవిధ్యం వారి జీవనం

అత్యంత నియమబద్ధం... జైన్ల సంప్రదాయం

సూర్యోదయానికి ముందే సమస్త పూజలు

తరువాతే అన్నపానీయాలు

గురువులుగా మారితే ఎన్నో కఠిన నియమాలు

నరసాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న జిల్లా అనేక మతాలకు నిలయం. స్థానికులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపార, ఉద్యోగాల నిమిత్తం అనేక మంది జిల్లాలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో జైన్ మతస్థులు ఒకరు. దేశంలోనే అత్యంత పురాతన మతాల్లో ఒక్కటైన జైన్ మతస్థులు జిల్లాలో అత్యధికంగా ఏలూరు పట్టణంలో ఉన్నారు. తరువాత నరసాపురం, భీమవరం, తణుకు, పాలకొల్లు ప్రాంతాల్లో పలు వ్యాపారాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో కొందరు వందేళ్ల క్రితమే జిల్లాకు విచ్చేశారు. అత్యధికంగా రాజస్తాన్‌లోని జాలూర్ జిల్లా నుంచి వచ్చినవాళ్లే ఉన్నారు. వీరి ఆచార వ్యవహారాలు, నియమాలు చాలా కఠినంగాను వింత గానూ ఉంటాయి.. జైన సంప్రదాయాలు, జిల్లాలో ఉన్న ఆలయాలపై ప్రత్యేక కథనం..



నిష్ఠగా నియమాలు...

జైన్‌ల సంప్రదాయాలు చాలా నిష్ఠగా ఉంటాయి. సూర్యోదయం కంటే ముందుగా నిద్ర లేచి పూజా కార్యక్రమాలను ముగించుకుంటారు. పిల్లల నుంచి పెద్దల వరకు కాలకృత్యాలు తీర్చు కుని విధిగా ఆలయాలకు వెళ్లతారు. లేని పక్షంలో 40 నిమషాల పాటు పూజతో పాటు ధ్యానం చేస్తారు. అప్పటి వరకు మంచినీళ్ల కూడా ముట్టరు. బెడ్‌కాఫీ అనేది ఈ సంప్రదాయంలో లేదు. నీటిని కూడా వడపోసి తాగుతారు. సూర్యాస్తమి కంటే ముందుగా భోజనాలు ముగిం చుకుంటారు.

హిందువులు, క్రిస్టియన్లు, ముస్లిం లు కాశీ, జెరూసలెం, మక్కాను దర్శించాలని ఎలా అనుకుంటారో..జైన్లు కూడా తప్పకుండా గుజరాత్ లోని పాలితనా, బిహార్‌లోని సిక్కర్జను దర్శించు కోవడం పరిపాటి. వీరు పూర్తిగా శాఖాహారులు.



పెదఅమిరంలో పాలరాతితో నిర్మించిన ఆదినాథ్ దేవాలయం



గోవులను ఎక్కువగా పూజిస్తారు. జిల్లాలో వీరి ఆలయాలు భీమవరం, నరసాపురం, తణుకు, ఏలూరు, ఆచంట ప్రాంతాల్లో ఉన్నాయి. ఇక్కడకు మత గురువులు వస్తుంటారు. వీరికి మహావీర్ జైన్ జయంతి పెద్ద పండుగ.

నాలుగు నెలలు కఠిక ఉపవాసం

హిందువులు కార్తీకమాసం, ముస్లింలు రంజాన్‌లో ఎలా ఉపవాసాలు చేస్తారో జైన్ మత స్థులు కూడా ఏడాదిలో నాలుగు నెలల పాటు కఠిక ఉపవాసాలు చేస్తారు. వీటినే చాతుర్మాసా లంటారు. ఆహారంలో కనీసం ఉల్లిపాయ కూడా తగల నివ్వరు. ఇక వీరి పెళ్లిలు సంప్రదాయ బద్దంగా జరుగుతాయి. ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు.. బంధువులు, చుట్టాలు ఎక్కడున్న విధిగా హాజరవుతారు. మనకు నిశ్చయ తాంబు శాలు ఎలాగో వీరికి రింగ్ ఫంక్షన్ అని వైభ వంగా నిర్వహిస్తారు. ఇక ఎవరైనా చనిపోతే 11 రోజుల పాటు మైలు పాటిస్తారు,


ఉద్యోగాల కన్నా..వ్యాపారాల్లోనే..

జైన్‌లు వారి పిల్లల చదువుల విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకుంటారు. మంచి స్కూళ్లల్లో చదివిస్తారు. ఆ తరువాత వ్యాపారంలోకి దించు తారు. ఎక్కువగా బంగారం, తాకట్టు, మెడికల్, వస్త్ర వ్యాపారాల్లోనే వీరు స్థిరపడతారు, ఉద్యో గాల్లో స్థిరపడేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. అయితే ఇటీవల చాలామంది ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా ఈ మతం నుంచే వస్తున్నారు.

పర్యాటక క్షేత్రాలుగా జైన ఆలయాలు

ఆచంట : ఆచంటలో శ్రీ పద్మ ప్రభు శ్వేతాంబర్ జైన్ దేవాలయం నిర్మించారు. 2007లో ఆచంటలో స్వయం భూగర్భం నుంచి వెలిసిన జైన్‌దేవుని విగ్రహం ఆచంటకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చింది. అప్పట్లో జైన్‌లు ఈ విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. తరువాత ఆచంటలో సుందరమైన జైన్‌దేవుని ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయం జైన్ భక్తులతో పాటు అందరినీ ఆకర్షిస్తున్నది. ఆచంట-మార్టేరు రోడ్డులో మెయిన్ రోడ్డు పక్కన ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రతీ సంవత్సరం డిశంబరు నెలలో ఇక్కడ పెద్ద ఎత్తున జైన్ దేవుని వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి జైన్ యాత్రికులు ఆచంట వస్తూనే ఉన్నారు. ఆచంట మండలం లోని కొడమంచిలిలో కూడా మెయిన్ రోడ్డుప క్కనే ఇటీవల నాగేశ్వర పార్శనాథ్ స్వేతాంబర్ జైన్ దేవుని ఆలయం నిర్మించారు.





ఆచంట పద్మప్రభు శ్వేతాంబర్ జైన్ ఆలయం

పెద అమిరంలో ఆదినాథ్

కాళ్ళ : కాళ్ల మండలం పెదఅమిరంలో జైనుల ప్రథమ తీర్థంకరుడు అయిన రిషబ్‌దేవ్ (ఆదినాథ్) దేవాలయం శిల్ప కళా నైపుణ్యంతో అలరారుతోంది. ఈ ఆలయంలో ఉన్న తీర్థాధి పతి విగ్రహం సుమారు 2500 సంవత్సరాల పురాతనమైనదిగా భావిస్తున్నారు. జైన తీర్థం కరులు 24 మందిలో మొదటి తీర్థంకరుడు రిషబ్‌దేవ్ కొలువైన ఈ ఆలయానికి ప్రతీ ఏటా కార్తీక పౌర్ణమి రోజున దేశం నలుమూలల నుంచి జైనులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుం టారు. ఈ విగ్రహం పెదఅమిరం గ్రామంలో సుమారు 150 సంవత్సరాల క్రితం పంట పొలాల్లో బయటపడిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సుమారు వందేళ్ల క్రితం గ్రామ స్థులు ఈ విగ్రహాన్ని జైన విగ్రహంగా భావించి భీమవరంలోని జైనులకు తెలియజేశారు. ఇది జైన విగ్రహమేనని తాము తీసుకువెళ్ళి దేవా లయం నిర్మిస్తామని గ్రామస్థులను కోరగా అందుకు వ్యతిరేకించారు. భీమవరం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసాపురం, రాజ మండ్రి, తణుకు ప్రాంతాల్లోని జైనులు అంతా కలిసి గ్రామస్థులను ఒప్పించి పెదఅమిరంలోనే జైన దేవాలయం నిర్మించారు. 2008లో కోట్లాది రూపాయలతో నూతన పాలరాతి దేవాలయ నిర్మాణం ప్రారంభించి 2015 ఫిబ్రవరి 2న ఆదినాథ్ విగ్రహంతో పాటు నూతనంగా తయారు చేయించిన 23 విగ్రహాలను ప్రతిష్ఠిం చారు. గ్రామ ప్రజలకు ఈ దేవాలయాన్ని సంద ర్శిస్తే తమ కోరికలు నెరవేరుతాయని నమ్మకం. సకాలంలో వర్షం కురవకపోతే 108 బిందెలతో లేక 108 కొబ్బరికాయలతో అభిషేకం చేస్తే వర్షం తప్పక కురుస్తుందని ప్రజల నమ్మకం. ఇది కేవలం జైన పుణ్యక్షేత్రమైనా చుట్టుపక్కల ప్రజలు, విభిన్న మతాల వారు ఇక్కడి ఆలయాన్ని దర్శించడం విశేషం.



వాతావరణం అనుకూలిస్తే పాపికొండల పర్యటనకు ఓకే

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

పోలవరం అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావం ఉన్న కారణంగా పాపి కొండల పర్యటనకు స్వల్ప విరామం ఇచ్చినట్లు మన్యం జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే 26 నుంచి బోట్ల రాకపోకలు సాగించవచ్చని తెలిపారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ గండిపోచమ్మ ఆలయం వద్ద టూరిజం బోట్ల పాయింట్‌ని పరిశీలించారు. గోదావరి నీటి మట్టం తగ్గిన నేపథ్యంలో ఈ నెల 23 నుంచి టూరిజం బోట్ల రాకపోకలు కొన సాగించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ ఈ నెల 22 నుంచి 24 వరకూ అల్పపీడన ప్రభావం, తుపాను హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో టూరిజం బోట్ల రాకపోకలకు అనుమతులు నిలిపివేశామన్నారు. తుపాను ప్రభావం తగ్గిన తర్వాత బోట్ల రాకపోకలు అనుమతులు ఇస్తామన్నారు. బోటు ప్రయాణ సమయంలో ప్రమాదాలు ఎదురైతే ఎలా అధి గమించాలనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహిం చారు. తెలంగాణ రాష్ట్రం భద్రాచలం బోట్ పాయింట్ నుంచి, పోశమ్మగండి బోట్ పాయింట్ నుంచి పేరంటాలపల్లికి రాకపోకలు సాగించే బోట్ల లైసెన్సులు, ఫిట్‌నెస్, మౌళిక సదుపాయాలు తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించారు.



భీమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భీమేశ్వరస్వామి దర్శనం నిలిపివేత

భీమవరం టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భీమవరం భీమేశ్వరస్వామి గర్భాలయంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం నుంచి 30 వతేదీవరకు దర్శనాలను నిలిపి వేసినట్టు ఈవో తోట శ్రీనివాస రావు తెలిపారు. శుక్రవారం ఉదయం కాళ్ళ కూరుకు చెందిన పుల్లేటికుర్తి చిన్నా ఆధ్వర్యంలో కళాపకర్షణ కార్యక్రమాలను నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ మండపరాధన, ప్రధాన కలశారాధన, హోమాలను నిర్వహించి స్వామివారి కళలు కలశంలో నిక్షిప్తం చేశారు. అనంతరం కలశాన్ని ఆలయంలోని మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో ఉంచారు. ఐదురోజులు పాటు అక్కడే స్వామి వారికి పూజలు నిర్వహిస్తారు. గర్భాలయంలో మరమ్మతులు పూర్తియిన తరువాత 30న స్వామివారికి కల్యాన్యాసం చేసిన తరువాత భక్తులకు దర్శనం కల్పిస్తారు.

యోగా మాస్టార్



యోగాలో అద్భుతాలు సృష్టిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్

రోగాన్ని తగ్గించుకునేందుకు నేర్చుకున్న విద్య జాతీయ స్థాయిలో కీర్తి తెచ్చింది..

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆస్మాతో ఇబ్బంది పడుతున్న ఆయనకు యోగాసనాలు వేస్తే తగ్గుతుందని ఎవరో చెప్పిన మాట విని యోగా నేర్చుకున్నారు. ఆ యోగానే ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించేందుకు బాట వేసింది. తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీగా చేస్తున్న బడుగు చంద్రశేఖర్ యోగాలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆయన తను మాత్రమే యోగా పోటీలకు వెళ్లడమే కాకుండా తన విద్యార్థులను కూడా మెరికల్లా తయారుచేసి యోగాలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఆయన తనకు ఈ విద్యనేర్పిన గురువు విజయవాడకు చెందిన బిక్షపతిని నేటికీ గుర్తుచేసుకుంటారు.

జాతీయ స్థాయికి..

తన అనారోగ్యాన్ని అధిగమించేందుకు నేర్చుకున్న యోగాలో ఏడాదిపాటు కఠిన శిక్షణ తీసుకున్న చంద్రశేఖర్ ఎంతో మందికి మార్గ దర్శకుడిగా మారారు. బాడీ బిల్డింగ్‌లో రాణించిన ఆయన యోగాలో ఎన్నో ఆసనాలు నేర్చుకున్నారు. తాజాగా కర్నూల్‌లో స్టేట్ మీట్‌లో బంగారు పతకం సాధించిన చంద్రశేఖర్ మైసూర్‌లో నిర్వహించే యోగా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఇటు యోగాలోనే కాకుండా దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను క్రీడల్లో మెరికల్లా తయారు చేస్తూ జిల్లాలోనే ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఇటీవల ఆగస్టు 15 వేడుకల్లో కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

యోగాలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

చదువుతో పాటు విద్యార్థులకు యోగ ఒక భాగంగా శిక్షణ ఇవ్వాలి. తాడేపల్లిగూడెం మాగంటి కల్యాణ మండపంలో తొమ్మిదేళ్లుగా ఉచితంగా శిక్షణ ఇస్తూ జాతీయస్థాయి పోటీలకు పంపే విధంగాఎంతో మంది శిష్యులను తయారు చేశాను.వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం నిర్వహిస్తూనే అవకాశం ఉన్నంత మేరకు అందరికీ యోగా నేర్పించాలన్నదే తన లక్ష్యమని చంద్రశేఖర్ చెప్పారు.



ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న చంద్రశేఖర్



యోగాసనాలు నేర్పిస్తూ..



ఒకప్పుడు జైలు.. ఇప్పుడు స్కూలు



ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాల

అది ఒకప్పుడు జైలు. ఇది గతం..కానీ నేడు ఎంతో మంది విద్యా కుసుమాలను, మేధావులను తీర్చిదిద్దిన సరస్వతీ నిలయం. ఇదీ పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాల చరిత్ర. బ్రిటీష్ కాలంలో ఈ పాఠశాలను జైలుగా ఉపయోగించేవారు. స్వాతంత్ర సమరయోధులను అరెస్టు చేసి బందీలుగా ఈ ప్రాంగణంలో ఉంచేవారు. 1944 వరుకూ ఇది జైలుగానే కొనసాగింది. అయితే 1944వ సంవత్సరంలో బ్రిటీష్ కాలంలోనే కార్మిక శాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ఈ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ ప్రాంగణం జైలుగా కాదని స్కూల్‌గా ఉండాలని తాను బ్రిటీష్ ప్రభుత్వంతో మాట్లాతాన్నారు. తరువాత ఈ ప్రాంగణం ట్రైనింగ్ స్కూల్‌గా మార్చబడింది. చదువు చెప్పే ఉపాధ్యాయులకు ఈ ప్రాంగణంలో శిక్షణ ఇచ్చేవారు. 1957 సంవత్సరంలో ఈ ప్రాంగణం ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలగా అధికారికంగా తీర్చిదిద్దబడింది. అప్పటి నుంచి ఎంతో మంది మేధావులను ఈ పాఠశాల తయారుచేసింది. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన ఎందరో నేడు ప్రభుత్వ అధికారులుగా ఉన్నారు. చాలా మంది విదేశాల్లో స్థిరపడ్డారు. తమను ఇంత ఉన్నత స్థానంలో ఉంచిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలన్న తలంపుతో ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. కళాప్రాంగణం, సైకిల్ స్టాండ్, సీసీ కెమారాలు, కంప్యూటర్లు వంటివి ఏర్పాటు చేశారు. జైలుగా ఉన్న ప్రాంగణం పాఠశాలగా మారి ఇప్పటికి సుమారు 80 సంవత్సరాలు పూర్తి కావస్తున్నది. అంబేడ్కర్ ఈ ప్రాంగణాన్ని సందర్శించి పాఠశాలగా తీర్చిదిద్దడంతో 30-03.2021 న ఈ పాఠశాల అంబేడ్కర్ ఫోటోతో చిత్రీకరించిన అరుదైన పోస్టల్ కవర్ పురస్కారాన్ని సొంతం చేసుకుంది.

- పెంటపాడు



పాఠశాలకు దక్కిన అరుదైన పోస్టల్ కవర్ పురస్కారం



ప్రకృతి చెక్కిన శిల్పం

ఒకమ్మాయి స్తంభానికి చేతులు ఆనుకుని నిలబడినట్టు ఉన్న ఈ చిత్రం నిజంగా విచిత్రమే.. ఇది ఎవరో చెక్కిన శిల్పమూ కాదు.. గీసిన చిత్రమూ కాదు.. ఎండిన తాటిచెట్టు ఆకులు ఇలా యువతి ఆకృతిలా కనిపించాయి.. పెనుమంట్ర మండలం పాలమూరు పెట్రోల్ బంకు సమీపంలో కనిపించిన ఈ దృశ్యాన్ని ఒకరు తన కెమెరాలో ఇలా బంధించారు...



చిత్రం చెప్పిన కథ

స్పోర్ట్స్ కాలమ్



నన్నయ విశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ జట్టుతో రిజిస్ట్రార్ సుధాకర్

నన్నయ వర్సిటీ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు తమ ప్రతిభతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు తీసుకురావాలని రిజిస్ట్రార్, క్రీడాబోర్డ్ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ కోరారు. నన్నయ వర్శిటీలో రెండురోజులపాటు జరిగిన అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్ బాల్ టోర్నమెంట్, జట్టు ఎంపికలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జట్టు పేర్లను ప్రకటించారు. ఈ టోర్నమెంట్‌కు హాజరైన వారిలో ప్రతిభ కనబరచిన 12 మంది క్రీడాకారులతో బాటు మరో నలుగురిని నన్నయ యూనివర్శిటీ జట్టుగా ఎంపిక చేశామన్నారు. వీరు నవంబర్ ఒకటి నుంచి బెంగుళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటిస్థానంలో రామచంద్రపురం ప్రభుత్వ కళాశాల, రెండో స్థానంలో జి.మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి కళాశాల, మూడో స్థానంలో పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాల, నాలుగో స్థానంలో ఏలూరు సీఆర్ఆర్ కళాశాల నిలిచాయన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యుడు, రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీకులు రమణ, కోర్సు కోఆర్డినేటర్ కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, బి.రామ్‌గోపాల్, డేవిడ్ పాల్గొన్నారు.

జట్టు ఇదే

వై.పవన్‌కుమార్, వి.అఖిల్‌కుమార్, ఎస్.వంశీ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం), టి.రాజేష్‌కుమార్, కె.సత్యనారాయణ, ఎస్‌కే అహ్మద్ ఆలీషా (డీఆర్‌కే రెడ్డి కళాశాల, జి.మామిడాడ), వి.సాయికిరణ్, ఎన్.ప్రవీణ్‌కుమార్, కేవీఎస్ కృష్ణారెడ్డి (ఎస్‌వీకేపీ కళాశాల, పెనుగొండ), బి.నీరజ్‌కుమార్ (సీఆర్‌ఆర్ కళాశాల, ఏలూరు), ఒ.రాజేష్ (పీఆర్ ప్రభుత్వ కళాశాల, కాకినాడ), సీహెచ్ అవినాష్ (సూర్యరాయ కళాశాల, పిఠాపురం), పి.అనిల్‌కుమార్ (ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.జానకిరామ్ (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), కె.షాహిల్ (వీఎస్‌ఎం కళాశాల, రామచంద్రపురం)ఎంపికయ్యారన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తణుకు కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి

తణుకు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో తణుకు కేకేఆర్ గౌతమ్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి లికేష్ బాలాజీ అండర్-14 కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. విద్యార్థిని పాఠశాల డీన్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ప్యాక్ట్ ప్రిన్సిపాల్ గంగాధర్ పీఈటీ రాఘవ సిబ్బంది అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, డీన్

రాష్ట్ర స్థాయి పోటీలకు పూళ్ళ విద్యార్థి ఎంపిక

భీమడోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం పూళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్‌కె నషీరుద్దీన్ అండర్- 17 బాలురు కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 25, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు హెచ్‌ఎం భువనేశ్వరరావు తెలిపారు. విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయులు రాజును, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మార్టేరులో నేడు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

పెనుమంట్ర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) మార్టేరులో నేటి నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రీ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్వీజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అండర్ 19 పోటీలు జరుగుతాయన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డీఈవో నారాయణ తదితరులు పాల్గొంటారని చెప్పారు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు విచ్చేశారన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు అల్లూరు విద్యార్థిని ఆశ్లేష

ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అల్లూరు జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థిని నీలిపల్లి ఆశ్లేష స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జగ్గయ్యపేటలో ఈ నెల 23న జరిగిన అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.



ఈనెల 27 నుంచి రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా తరపున పాల్గొంటుందని హెచ్‌ఎం రామోజీ తెలిపారు.

నేడు త్రిపుర గవర్నర్ పర్యటన

ఉంగుటూరు/భీమవరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో త్రిపుర రాష్ట్ర గవర్నరు నల్లు ఇంద్రసేనారెడ్డి శనివారం పర్యటించనున్నారు. నారాయణపురంలో బీజేపీ నాయకురాలు శరణాల మాలతీ రాణి ఇంటి వద్ద పార్టీ కార్యకర్తల సమావేశం, ఎమ్మెల్యే ధర్మరాజు ఆధ్వర్యంలో ఆక్వా రైతులతో సమావేశం అవుతారు. రాత్రి 9-30 గంటలకు భీమవరంలోని టూరిజం గెస్ట్‌హౌస్‌లో రాత్రి బస చేస్తారు. 27వ తేదీ ఉదయం ఆనంద ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకలో పాల్గొంటారు. ఆ తర్వాత దొంగపిండి ఫిష్ కల్చర్ ట్యాంక్ వద్దకు చేరుకుంటారు. తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కు అండ్ ఫంగస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను సందర్శిస్తారు. జువ్వలపాలెం ఆనంద గెస్ట్ హౌస్‌లో ఎలైట్ సిబ్బంది, వ్యాపారవేత్తలు, మీడియాతో పరస్పర చర్చలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి తాడేపల్లిగూడెం వెళతారు. సాయంత్రం విజయవాడ విమానాశ్రయానికి వెళతారని సమాచార శాఖ తెలిపింది.

వ్యవసాయ అధికారులకు ముగిసిన శిక్షణ

పెనుమంట్ర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సమగ్ర సస్య రక్షణా పద్ధతులపై జరుగుతున్న ఐదు రోజుల శిక్షణ ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎన్.జీ. రంగా పరిశోధనా సంచాలకులు డా.క్టర్ పి.వి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాలు జిల్లాస్థాయి అధికారులకు కూడా నిర్వహించడం వల్ల పరిధి పెరుగుతుందని తెలిపారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ డా.ఎ.సిద్దికి మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా, పొలంలో నిర్వహించిన ప్రాక్టికల్ క్లాసులు చాలా విస్తరణ అధికారులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.



ఇంటర్వ్యూ

త్వరలో మెస్ సమస్యకు పరిష్కారం

- విద్యార్థులకు యూనిఫాం, ల్యాప్‌టాప్‌లు అందిస్తాం
- టిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్ సమస్యను అతిత్వరలో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వివరించారు.

ఆంధ్రజ్యోతి: నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నూతన మెస్‌టెండర్లను దసరా సెలవుల్లో ఖరారు చేస్తామని చెప్పారు. నూతన మెస్‌ల ఏర్పాటు ఎంతవరకు వచ్చింది?

డైరెక్టర్: నాసిరకపు భోజనం అందిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో నూతనంగా మెస్ నిర్వాహకులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అయితే దీనికి సంబంధించి మెనూను విద్యార్థుల సూచనల మేరకే రూపొందించటం జరిగింది. నూతన మెనూ ప్రకారం మెస్ రేట్లను ఖరారు చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదించగా, ఫుడ్‌సేఫ్టీ అధికారుల ద్వారా మెస్ ధరల నిర్ణయానికి చర్యలు చేపట్టారు. ధరలు నిర్ణయం తర్వాత టెండర్లు పిలుస్తాం.

ఆంధ్రజ్యోతి: ఫుడ్‌కోర్టు నిర్వహణ బాధ్యతలపై మెప్మాతో ఎంవోయు కుదుర్చుకున్నట్లు ఉన్నారు?

డైరెక్టర్: ఫుడ్‌కోర్టు కాంట్రాక్ట్ ముగిసింది. ఈ నేపథ్యంలో ఫుడ్‌కోర్టుతో పాటు క్యాంపస్‌లోని వివిధ దుకాణాల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించాలని త్రిమెన్‌కమిటీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఫుడ్‌కోర్టు, ఇతర దుకాణాలను నూజివీడు మునిసిపల్ కమిషనర్ ద్వారా మెప్మా (పట్టణ మహిళా సమాఖ్య)కు అప్పగించటం జరిగింది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, యూనిఫాంలు ఇప్పటికి అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి?

డైరెక్టర్: ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ల్యాప్‌టాప్, యూనిఫాం తదితరాలను కొనుగోలు చేసేందుకు టెండర్లను పిలవాల్సి ఉంది. అయితే గతంలో పనిచేసిన అధికారులు టెండర్లను పిలువకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత రెండుసంవత్సరాలుగా విద్యార్థులకు నూతన ల్యాప్‌టాప్‌లు, యూనిఫాంలు కొనుగోలు చేయలేదు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించాం. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: నూజివీడు పట్టణంలో ట్రిపుల్ ఐటీ నుంచి వచ్చే మురుగునీటి సమస్య ఇబ్బందిగా ఉంది. ప్రధానంగా గొడుగువారిగూడెంలోని వ్యవసాయ భూములు, మురుగునీటి వల్ల ఇబ్బంది ఎదురవుతోంది.

డైరెక్టర్: నూజివీడు ట్రిపుల్‌ఐటీ నుంచి వచ్చే మురుగునీటిని ఎస్‌టీపీ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయటం జరుగుతోంది. అయితే సదరు నీటిని తరలించేందుకు 2009లో ప్రత్యేకంగా పైప్‌లైన్ నిర్మాణానికి రూ.52 లక్షలను నూజివీడు మునిసిపాలిటీలో అడ్వాన్స్‌గా చెల్లించాం. అది నేటికి ఆచరణలోకి రాలేదు. ఇటీవల ఐదు కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ నిర్మించేందుకు మూడున్నర కోట్లతో మునిసిపల్ అధికారులు అంచనాలు వేశారు. త్వరలో టెండర్లు పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

జ్వరాలపై అశ్రద్ధ వద్దు

డీఎంఅండ్‌హెచ్‌వో మహేశ్వరరావు

పాలకోడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఇంటింటిని పర్యవేక్షిస్తూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి (డీఎంఅండ్ హెచ్‌వో) మహేశ్వరరావు అన్నారు. మోగల్లు గ్రామంలోని అరుంధతి కాలనీలో పరిసరాలు ఇబ్బందికరంగా ఉన్నాయంటూ తద్వారా జ్వరాలు వ్యాపిస్తున్నాయని గ్రామానికి చెందిన కేవీపీఎస్ నాయకుడు కే.క్రాంతిబాబు, డీఎంఅండ్ హెచ్‌వోకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో డీఎంఅండ్‌హెచ్‌వో మహేశ్వరరావు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే నిర్వహించాలని మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగం నాయుడును ఆదేశించారు. దీంతో రంగంనాయుడు గ్రామంలో మెడికల్ క్యాంపుతో పాటు పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో జ్వరాలపై శుక్రవారం సర్వే చేయించారు. జ్వరాలపై జరుగుతున్న సర్వే తీరుతెన్నులను డీఎం అండ్‌హెచ్‌వో మహేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, ఏఎంవో పీ.శ్రీనివాసరావు, భీమవరం సబ్ యూనిట్ ఆఫీసర్ భాస్కరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ స్వర్ణనిరంజనికి తగు సూచనలు అందించారు.

జడ్జీల బదిలీ

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న సీనియర్ సివిల్ జడ్జిలలో 16 మందికి జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు ఇచ్చారు. భీమవరం సివిల్ జడ్జిగా పనిచేస్తున్న బి.అప్పలస్వామిని విజయనగరం ఎస్సీ ఎస్టీ కం ఐదో అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం అనురాధను కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. గుడివాడ ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న బి లక్ష్మీనారాయణ భీమవరం పోక్సో కోర్టు జడ్జిగా నియమించారు.



సిమెంట్ రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్

- వైసీపీ నాయకుడి దుశ్చర్య

ద్వారకా తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా.... వైసీపీ నాయకులకు అధికారులు ఇంకా కొమ్ము కాస్తూనే ఉన్నారు. మండలంలోని తిమ్మాపురంలో దాదాపు ఆరేళ్ల క్రితం సిమెంటు రోడ్డు నిర్మించారు. ఓ వైసీపీ నేత ప్రజలు రాకపోకలు సాగించే పంచాయతీ రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ వేయించి, కనీసం నడవకుండా రాళ్లను గుట్టగా వేయించాడు. దీంతో ఆ ప్రాంత వాసులు పంచాయితీ, మండల అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఆప్రాంత వాసులు గద్దే వెంకటలక్ష్మి తన కుమారుడు రవీంద్ర, సాయిన నాగలక్ష్మి, నాగరాజు, ప్రమీలరాణిలతో కలసి గతనెల 23న కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. పరిష్కరించే గడువు ఈనెల 23తో పూర్తయినా సమస్య పరిష్కారం అవ్వలేదు. రోడ్డును అక్రమంగా ఆక్రమించి ఫెన్సింగ్ వేసిన సదరు వైసీపీ నేతపై అధికార యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం పలువురిని ఆశ్చర్యపరుస్తోంది. దీనిపై ఈవోపీఆర్డీ సుబ్బరాయన్‌ను వివరణ కోరగా రోడ్డును నిలిపివేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేశామని, అతను తొలగించకుంటే తామే తొలగిస్తామని చెప్పారు.

బదిలీల్లో మా అభిప్రాయం తీసుకోవాలి

పాఠశాలవిద్య కమిషనర్‌కు పీఆర్టీయూ నాయకుల వినతి



ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలపై చట్టాన్ని తీసుకురానున్న నేపథ్యంలో ముసాయిదా రూపకల్పనలో తమ అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థిస్తూ పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజుకు పీఆర్టీయూ నాయకులు శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. వివరాలను సంఘ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు ఇక్కడి పత్రికలకు తెలియజేశారు. అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు 8 ఏళ్ళు, హెచ్‌ఎంలు, ఎంఈవోలకు ఐదేళ్ళు గరిష్ట సర్వీసుగా కొనసాగించాలని, సర్వీస్ పాయింట్లు ఏడాదికి ఒకటి చొప్పున ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. గరిష్ట స్టేషన్ సర్వీసును పూర్తిచేసుకున్నవారికి స్పెషల్ పాయింట్లు కేటాయించాలని, తగినంత మంది విద్యార్థులులేరన్న కారణంతో బలవంతంగా బదిలీలు జరిపే టీచర్లకు అంతకుముందువున్న అన్ని పాయింట్లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణకు ఇంకా మూడేళ్ల సర్వీసువున్న వారికి బదిలీ నుంచి మినహాయింపునివ్వాలని అభ్యర్థించారు. మాన్యువల్‌గానే బదిలీలు నిర్వహించాలని, వెబ్ కౌన్సెలింగ్ వద్దని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల ప్రాతిపదికగానే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ గుర్తింపువున్న ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు బదిలీల్లో ప్రయార్టీ అవకాశం కల్పించాలన్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో మాత్రమే బదిలీలు నిర్వహించాలని, రిటైర్మెంట్ అయిన టీచర్ల స్థానాలను పదోన్నతులు ఇవ్వడంద్వారా అదేనెలలో భర్తీచేయాలని కోరారు. బదిలీలకు కనీస సర్వీసు రెండేళ్ళుగా నిర్ణయించాలని, అవివాహిత మహిళా ఉపాధ్యాయులకు స్పెషల్ పాయింట్లు కేటాయించాలని అభ్యర్థించారు. భార్య చనిపోయిన ఒంటరి పురుషున్ని స్పెషల్ కేటగిరీలో చేర్చాలని కోరామని, మున్సిపల్ టీచర్లను కూడా బదిలీల్లో చేర్చాలని అభ్యర్థించామన్నారు. నవంబరు మొదటివారంలో మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు ఇవ్వనున్నట్టు కమిషనర్ వెల్లడించారని తెలిపారు.



నారాయణపురంలో వినియోగదారుల సమస్యలను తెలుసుకుంటున్న విద్యుత్ వినియోగదారుల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు

ఉద్యోగులకు రూ.14.26 లక్షల జరిమానా

ఉంగుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో 11 జిల్లాల పరిధిలో 8077 విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించినట్లు విశాఖపట్నం ఏ.పి.ఈ.పి.డి.సి.ఎల్.విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ బి.సత్యనారాయణమూర్తి తెలిపారు. శుక్రవారం చేబ్రోలు సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార సదస్సు జరిగింది. ఇందులో విశ్రాంత న్యాయమూర్తి, చైర్మన్ బి.సత్యనారాయణ, సభ్యులు ఎస్.మసీల మణి, ఎస్.కే.బాబర్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 2024లో ఇప్పటి వరకు 395 ఫిర్యాదులు అందగా అందులో 315 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న ఉద్యోగులకు 107 కేసుల్లో రూ.14.26 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నెం 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : కలెక్టర్

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేనిపక్షంలో శిక్షార్హులవుతారని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి హెచ్చరించారు. శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిషోర్ రోడ్డు భద్రతా చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలా మంది ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించని కారణంగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారన్నారు. ఏలూరులోని శనివారం వట్లూరు, ఫైర్‌స్టేషన్ సెంటర్, సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని వాహన చోదకులపై నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధించడం, హెల్మెట్ అందించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో తాము, జిల్లా ఎస్పీ కూడా పాల్గొంటామని తెలిపారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

రోడ్డు ప్రమాదంలో తాతామనవడికి గాయాలు

పరిస్థితి విషమం... ఏలూరుకు తరలింపు



క్షతగాత్రులను ఏలూరు తరలిస్తున్న దృశ్యం

ద్వారకా తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న తాతామనవడిని రాళ్లకుంట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వారిరువురు తీవ్ర గాయాలపాలయ్యారు. నిడమర్రు మండలం పత్తేపురంకు చెందిన జి.వెంకటేశ్వరరావు(60) మండలంలోని దొరసానిపాడులోని తన కుమార్తె ఇంటికి గురువారం వచ్చాడు. ఆరోజు అక్కడ ఉండి మరుసటి రోజైన శుక్రవారం మనవడు భవానితో కలసి స్వగ్రామమైన పత్తేపురం బయలుదేరాడు. రాళ్లకుంట వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వారిరువురు రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడ వైద్యుడు ప్రవీణ్ కుమార్ వారికి ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వఆసుపత్రికి పంపించారు.

154 సెల్‌ఫోన్లు స్వాధీనం

యజమానులకు అందజేత



సెల్‌ఫోన్లు పరిశీలిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే, జూన్ నెలల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు టోల్ ఫ్రీ నెంబర్ 95503 51100కు ఫిర్యాదు చేసిన వారి ఫోన్లు కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టి 154 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసు కున్నట్టు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషో ర్ చెప్పారు. వీటి విలువ 21 లక్షల 56 వేల రూపాయలని స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యా లయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లాలో మొబైల్స్ పోగొట్టుకున్న వారు దొంగతనాలకు గురైన మొబైల్ హ్యాండ్ సెట్ల ఐఎంఇఐ నెంబర్లను స్వీకరించి ఆ మొబైల్ ఎవరు వినియోగిస్తున్నారో కనుగొని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లా అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, విజయ నగరం, తెలంగాణా తదితర ప్రదేశాల నుంచి 154 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 12 దఫాలుగా మొబైల్స్‌ను 1606 రికవరీ చేయగలిగామని, వీటి విలువ మూడు కోట్ల 11 లక్షల 83 వేల 684 అని చెప్పారు. జిల్లాలో మొబైల్స్ పోగొట్టుకున్న వారు టోల్ ఫ్రీ నెంబర్ 9550351100కు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా ఫోన్లు యజమానులకు ఎస్పీ కెపిఎస్ కిషోర్ స్వయంగా అందజేశారు. జిల్లాలో సెల్‌ఫోన్ నేరస్తులు, దృష్టి మళ్ళింపు చేసే ముఠాలు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బ్యాంకులు, ఏటీఎం సెంటర్లు, రైతు బజార్లు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉంటున్నారని ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎస్ సూర్య చంద్రరావు, సీసీఎస్ సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడిపై కిడ్నాప్ కేసు

పాలకోడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):మైనర్ బాలికను పెళ్ళి చేసుకుంటానని బలవంతంగా తీసుకెళ్ళిన భీమవరంకు చెందిన ఫొటోగ్రాఫర్ మద్దాల మణికంఠపై కిడ్నాప్ కేసు నమోదు చేసి ఆ యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్సై వర్మ తెలిపారు. పాలకోడేరు గ్రామానికి చెందిన బాలిక భీమవరంలోని కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నది. ఈ నెల 20వ తేదీన ఆ బాలికను మణికంఠ బలవంతంగా తీసుకెళ్ళాడు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నెల 21వ తేదీన మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీ శుక్రవారం లభ్యం కావడంతో ఆ యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మోటారు చోరీ

పెదపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుపై వున్న 7 హెచ్.పి. మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పెదపాడు మండలం సత్యవోలు గ్రామానికి చెందిన ఎస్.రాజు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ దర్యాప్తు చేస్తున్నారు. మోటారు విలువ సుమారు రూ. 5 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సత్యవోలు గ్రామంలో ఫణీంద్ర అనే వ్యక్తి ఇంటి వద్ద అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 31 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సారాపై దాడి

చింతలపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం నామవరం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి సారా కాస్తున్న బోడా రామారావును పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. అతని ఇంటి సమీపంలోనే తయారీ జరుగుతుందని, అతని వద్ద నుంచి 90 లీటర్ల సారా, 119 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను అక్కడే ధ్వంసం చేసినట్టు చెప్పారు. బెల్లం అమ్మిన బాణావతు మారేశ్వరరావుపై కేసు నమోదు చేశామని, అతను పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు అబ్దుల్ ఖలీల్, ఆర్.వి.ఎల్.నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి వ్యర్థాల రవాణాపై కేసు

భీమడోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా ఎటు వంటి అనుమతులు లేకుండా పర్యావరణానికి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రీతిలో కోడి మాంస వ్యర్థాలను రవాణా చేస్తున్న అశోక్ లేలాండ్ కంటైనర్‌ను సీజ్ చేసి వాహనం యజమాని అబ్బాసు, డ్రైవర్ మహ్మద్‌లపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కంటైనర్‌లో తరలిస్తున్న భారీ కోడి వ్యర్థాల లోడును భీమడోలు మండలం పాతూరు జాతీయ రహదారిపై గుర్తించిన భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ భారీ కోడి వ్యర్థాలలోడు చేపలకు వెళ్తుందా వేరే వినియోగానికి వెళ్తుందా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. అయితే ఈ కోడి వ్యర్థాలలోడు బుక్ చేసుకున్న సంబంధిత వ్యక్తి పూళ్ళ గ్రామానికి వాహనం వచ్చాక సమాచారం అందించాలన్నట్లు సంబంధిత లారీ డ్రైవర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

పెదవేగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. వేగివాడకు చెందిన బొకినాల వెంకటేశ్వరరావుకు అతని తండ్రి, సోదరునికి మధ్య ఆస్తి విషయంలో వివాదం జరుగుతోంది. ఈనెల 23వ తేదీన వారిమధ్య వివాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు అదేరోజు ఎవ్వరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్ళిపోయాడు. అతని ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, దీనిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం

కాళ్ళ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాత గొడవలను పురస్కరించుకుని యువకుడిపై దాడి చేసిన సంఘటనపై కాళ్ళ పోలీస్‌స్టేషన్లో శుక్రవారం హత్యాయత్నం కేసు నమోదు అయ్యింది. ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ళ గ్రామానికి చెందిన కొల్లి సాయిరాజేష్‌పై అదే గ్రామానికి చెందిన బి.నాగవరప్రసాద్ అలియాస్ పండుతో పాటు మరో ఇద్దరు యువకులు కలిసి గతంలో జరిగిన జాతర సందర్భంగా జరిగిన గొడవలను పురస్కరించుకుని గురువారం కోలనపల్లి గ్రామంలో బీరు సీసాతో దాడి చేశారు. ఈ దాడిలో సాయిరాజేష్ మెడపై తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని భీమవరం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

ద్వారకా తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జి కొత్తపల్లిలో బుధవారం అదృశ్యమైన యువకుడి మృతదేహం గ్రామంలోని ఊరచెరువులో లభ్యమైంది. కామవరపుకోట మండలం ఆడమిల్లికి చెందిన స్వర్ణాల వినోద్ కుమార్ (30)కూలిపనులు చేసుకుంటూ కుటుంబ పోషణ జరుపుతాడు. ఈక్రమంలో ఈనెల 23 సాయంత్రం కూలిడబ్బులు తెస్తా నని బయటకు వెళ్లిన వినోద్‌కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. అయితే గ్రామంలోని ఊరచెరువు వద్ద ఇతని చెప్పులు బైక్, మొబైల్ ఉండటంతో అనుమానం వచ్చిన పోలీసులు వెదుకులాట చేశారు. అతని మృతదేహం చెరువులో లభ్యమైంది. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహం కావడం లేదని యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వివాహం అవ్వడంలేదని జీవితంపై విరక్తి చెంది ఒక యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు పత్తేబా దకు చెందిన మరడాని నవీన్ కోహ్లికి (31)కి వివాహం కాలేదు. అతని తల్లి దండ్రులు 24 ఏళ్ళ క్రితం విడిపోవడం వల్ల ఆర్థిక ఇబ్బం దులు కారణంగా రెండు మూడు సార్లు రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇం కా తనకు వివాహం కావడంలేదని తీవ్ర మనస్తాపానికి గురై ఏలూరులోని చిట్టివలస పాకలు రైలుపట్టాల వద్దకు వెళ్ళి శుక్రవారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లుపై విజిలెన్సు దాడులు

7.60 లక్షల రేషన్ బియ్యం స్వాధీనం.. ఎనిమిది మందిపై కేసులు



అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో అమరావతి రైస్‌మిల్లులో గురు వారం రాత్రి విజిలెన్సు అధికారులు సోదాలు నిర్వహించారు. అక్కడ నిల్వ ఉంచిన ఏడు లక్షల 60 వేల రూపాయల విలువైన రేషన్ బియ్యం (380 బస్తాలు)ను స్వాధీనం చేసు కున్నారు. రేషన్ బియ్యాన్ని పాలిష్‌పట్టి తమి ళనాడు రాష్ట్రానికి అక్రమ రవాణా చేస్తు న్నట్లుగా గుర్తించారు. రేషన్ బియ్యాన్ని అక్ర మ రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలు రెండు, ఐదు వేల రూపాయల విలువైన ఎలక్ట్రానిక్ కాటాలను కూడా సీజ్ చేశారు. ఈ దాడిలో మొత్తం 18 లక్షల 65 వేల రూపాయల విలువైన సొత్తు సీజ్ చేసినట్లు ప్రకటించారు. పల్నాడు జిల్లాకు చెందిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులైన బాలి నేని తేజ, వెలుపుర్ల శ్రీనివాస్ అలియాస్ వాసు, చిలకలూరి పేటకు చెందిన ఇస్మా యేల్, ఏలూరుకు చేదెళ్ళ పవిత్రకుమార్, తాడేపల్లిగూడానికి చెందిన శానం రామకృష్ణ, రాధ, తాడాల శరత్ జీవన్, దాదాన శివకార్తీక్ రెడ్డిలపై కేసు నమోదు చేసిన ట్లుగా విజిలెన్సు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ పి శివరామకృష్ణ, విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్ కుమార్, సివిల్ సప్లై డీటీ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

బస్సు రూట్‌ల మార్పు

పెనుమంట్ర, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి) : కవిటం నుంచి మార్టేరు వరకు, పెనుగొండ నుంచి పెరవలి వరకు రహదారి మరమ్మతులు కారణంగా బస్సుల రూటు మార్చినట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బారెడ్డి తెలిపారు. తణుకు -నర్సాపురం ఆర్టీసీ బస్సులు కూడా రూట్ మార్చడం జరిగిందన్నారు. తణుకు - నరసాపురం రూట్ వెళ్ళు బస్సులు వయా గోపాలపురం, ఇరగవరం, కంతేరు, ఆలమూరు, కాపవరం నెలమూరు బ్రిడ్జి, లంకల కోడేరు, పాలకొల్లు మీదుగా నరసాపురం నడపబడునని తణుకు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు.

డిగ్రీ లెక్చరర్లకు పదోన్నతులు

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 16 మంది డిగ్రీ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు కళాశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించి పదోన్నతులు కల్పించడం పట్ల ప్రభుత్వ కాలేజీ టీచర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాఘవరెడ్డి, ఎం.శ్యాంబాబు హర్షం వ్యక్తంచేశారు. ప్రలోభాలు లేకుండా పూర్తి పారదర్శక విధానంలో పదోన్నతులు కల్పించారని తెలిపారు.

మహిళా ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి


జేఏసీ మహిళా విభాగం జంగారెడ్డిగూడెం కమిటీ

ఏలూరు రూరల్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): మహిళలు పనిచేసే ప్రతి కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీ జేఏసీ, అమరావతి, మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరి సునీత ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో వారు శుక్రవారం పర్యటించారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీల ఎన్నిక జరిగింది. మల్లీశ్వరి, రమాదేవి, ఎన్.రోజా, బి.లక్ష్మి, సత్యవేణి, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, రమాదేవి, పార్వతి, కె.హారిక, సృజనను ఎన్నుకున్నారు. మహిళా విభాగం బలోపేతం తదితర విషయాలపై చర్చించారు. రాష్ట్ర చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడారు. మహిళా ఉద్యోగులు పనిచేసేచోట కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో షి బాక్సులు ఏర్పాటుచేసి మహిళలకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సుందరి, దీపిక, శాంతకుమారి, యామిని, మహిళా విభాగం జిల్లా కార్యవర్గంతో పాటు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ ఎండి షరీఫ్

బుట్టాయగూడెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై పాఠశాలల హెచ్‌ఎంలతో మధ్యాహ్న భోజన పథకం ఏడీ ఎండీ షరీఫ్ శుక్రవారం సమీక్ష చేశారు. మధ్యాహ్న భోజన పథకం మెనూకు నెలవారీ ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న బియ్యం, గుడ్లు, చిక్కీలు, జగ్గరీ పౌడర్ కోసం నిర్ణీత తేదీల్లో సమాచారం, వివరాలు అందించాలని సూచించారు. ఎంఈవోలు టి.బాబురావు, నరేంద్రరాయ్ మాట్లాడుతూ హెచ్‌ఎంలంతా అపార్ ఐడీల రిజిస్ట్రేషన్, కిచెన్ గార్డెన్స్ పెంచడం, ఎండీఎం అమలు తప్పకుండా చేయాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి అందరూ సహకరించాలని తెలిపారు. ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ఎండీఎం కోఆర్డినేటర్ గౌస్, టీఎంఎఫ్ కోఆర్డినేటర్ కుమార్ అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ఏలూరు, నాచుగుంటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని అడ్డుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి పీవీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకటాపురం వార్డు సచివాలయం పరిధిలో సాయినగర్ ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. అపరిశుభ్రతతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికన్‌గున్యా వంటి వ్యాధులు సంభవిస్తాయన్నారు. దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ మలేరియా అధికారి కె.గోవిందరావు, విస్తరణాధికారి రామాంజనేయులు, హెచ్ఎస్ నాగమల్లేశ్వరరావు, కిరణ్‌కుమార్, తులసి, శ్రీనివాసరావు, నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ప్రతి శుక్రవారం రోజును డ్రైడే పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వై.వీ.లక్ష్మణరావు సూచించారు. కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలోని నాచుగుంటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా కంట్రోల్ హైజీన్ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయా ప్రదేశాలను గుర్తించి నిర్వీర్యం చేయాలన్నారు. పలు ప్రాంతాల్లో నిల్వ నీటిని తొలగించారు. కె.శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఆరోగ్య కార్యదర్శి ధనలక్ష్మి, ఆశా వర్కర్ వజ్రమ్మ, శ్రీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు మండలాల సమస్యల పరిష్కారానికి ఎంపీ హామీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

కుక్కునూరు, అక్టోబరు 25: పోలవరం ముంపు మండలాల్లో సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ హామీ ఇచ్చారని టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. కుక్కునూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధ్వానంగా తయారైన కుక్కునూరు - భద్రాచలం, కుక్కునూరు-అశ్వారావుపేట ఆర్ అండ్ బీ ప్రధాన రహదారుల నిర్మాణానికి ఎంపీ చొరవ తీసుకున్నారు. విద్యుత్ సరఫరా ఇబ్బందులను స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో పోలవరం నిర్వాసితులకు జరిగిన సర్వే ప్రకారం, జాబితాల ప్రకారం నిర్వాసితులకు పరిహారం అందిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. 18 ఏళ్ల వయసు వారికి పరిహారంపై సీఎం దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, చుంచు సత్యనారాయణ, పులి శ్రీను, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ నిబంధనలు పాటించాలి

పెదవేగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని, నిబంధనలను పాటించాలని తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ సూచించారు. గ్రామాల్లో అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అగ్నిప్రమాద నిరోధకాలను అందుబాటులో పెట్టుకుని మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. చిన్నపిల్లలను దుకాణాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలనికూడా ఆమె దుకాణదారులకు వివరించారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లలకు సరైన జాగ్రత్తలు చెప్తూ, అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు తెలియపర్చారు. టపాసులు వెలిగించే సమయంలో నూలు, సిల్కు దుస్తులు కాకుండా కాటన్ దుస్తులు ధరిస్తే మేలని తహసీల్దారు భ్రమరాంబ జాగ్రత్తలు చెప్పారు.


రాజీవ్‌గాంధీ పార్కు వద్ద చెత్త


అశోక్ నగర్ ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో మురుగు


తంగెళ్లమూడి తమ్మిలేరులో చెత్త కుప్ప



కంపు కొడుతున్న నగరం

ఏలూరులో పారిశుధ్యం అధ్వానం



అధ్వాన పారిశుధ్యంతో ఏలూరు నగరం కంపు కొడుతోంది. దోమల వ్యాప్తితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అధిక వర్షాలతో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయింది. డ్రెయిన్లతో చెత్తా చెదారం పూడికతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయింది.

చెత్త సేకరణ వాహనాలు సరిగా తిరగక నగర వీధుల్లో చెత్తపేరుకుపోయింది. దీంతో ప్రతీ ఇంట్లో దోమలు దాడి చేస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు దోమల నివారణ కోసం ప్రతీ నెల రూ.8లక్షల బిల్లు చేసుకుంటారు. ఫాగింగ్ మిషన్లు ఆరు ఉంటే మరమ్మతులతో ఒక మిషన్ నగరంలో తిరుగుతుంది. 11స్ప్రేయింగ్ మిషన్లు ఉన్న వాటిని ఎక్కడా వినియోగించిన దాఖలాలు లేవు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికన్‌గున్యా సహా సీజనల్ వ్యాధులు ఈ ఏడాది అధికంగా నమోదయ్యాయి. ఈఎంఐలు కట్టకపోవడంతో క్లాప్ వెహికల్స్‌ను కాంట్రాక్టరు తగ్గించేశారు. 30 వాహనాలు కూడా తిరగడంలేదు. మున్సిపల్ ఎంహెచ్‌ఓ పోస్టు ఖాళీ. ప్రస్తుతం టూటౌన్ అడిషనల్ కమిషనర్, వన్‌టౌన్ డిప్యూటీ కమిషనర్లు నిర్వహిస్తున్నారు. వీరిద్దరు కూడా స్థానికంగా నివాసం ఉండరు. పర్యవేక్షణలేక పారిశుధ్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరమంతా అపారిశుధ్యం, దోమలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

- ఏలూరు టూటౌన్




ఏలూరులో పాఠశాల పారిశుధ్య కార్మికుల ధర్నా, ఉంగుటూరు, బుట్టాయగూడెంలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పాఠశాల పారిశుధ్య సిబ్బందికి వేతన బకాయి చెల్లించాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందికి మూడు నెలల వేతన బకాయి చెల్లించాలంటూ సీఐటీయు ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంవద్ద శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ జిల్లాలో 1900 మంది మహిళా కార్మికులకు జూలై నుంచి సుమారు రూ.3.50 కోట్ల బకాయి ఉందన్నారు. నెల నెలా గౌరవ వేతనం చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయకుంటే వచ్చేనెల 4నుంచి పాఠశాలల్లో పారిశుధ్య పనులను నిలిపివేస్తామన్నారు. ధర్నా అనంతరం డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షురాలు దుర్గ, పూజిత, గౌసియా, సబీరా, ఉషారాణి, భవాని, సరస్వతి, బాలాజీ, ఝాన్సీరాణి, జమీల తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ మండల విద్యావనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి, సీఐటీయూ మండల నేత గుత్తికొండ వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతిపత్రం అందించారు. లింగంపల్లి సత్యవతి, ఎ.అనంతలక్ష్మి, కె.పద్మ, యు.పుష్ప, జె.కవిత, కె.లక్ష్మీనారాయణ, లింగంపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: వేతన బకాయిలను చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏడీ షరీఫ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నేత మొడియం నాగమణి మాట్లాడుతూ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి నెల 5లోపు వేతనాలు ఇవ్వాలన్నారు. వర్కర్లు వెంకటలక్ష్మి, రత్నకుమారి, నాగమణి, మంగ, సంధ్య, సోమాలమ్మ, రామలక్ష్మి, గంగాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో రైతు ఖాతాలో నగదు జమ

ఉంగుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులోని రైతు సేవా కేంద్రం ద్వారా ఇప్పటి వరకు రూ.2.79లక్షల విలువైన 12.040 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపామని జేసీ.ధాత్రి రెడ్డి తెలిపారు. ధాన్యం తోలిన 48 గంటల్లో సంబంధిత రైతుల ఖాతాకు నగదు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో164 సొసైటీలు, 75 డీసీఎంఎస్‌లు 11 రైతు సంఘాలు వెరసి 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పనితీరును అసిస్టెంట్ డైరెక్టర్ ఐఎం షరీఫ్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మంచి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పాఠశాలలో విద్యార్థులంతా మధ్యాహ్నం భోజనాన్ని తింటున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను మధ్యాహ్న భోజనంపై సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కోఆర్డినేటర్లు బీఎస్ఎస్ కుమార్, గౌస్ మొహిద్దీన్, హెచ్‌ఎం పి.గ్లోరీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహం

టి.నరసాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బండివారిగూడెం పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని చింతలపూడి ఎంపీపీ బి.రాంబాబు శుక్రవారం ఆవిష్కరించారు. నాళం పురుషోత్తం తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బహూకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని, నేలపాటి సురేష్‌కుమార్ కుమారుడు శ్రీకరల్ బహూకరించిన మదర్‌థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించారు. నాళం సునీల్ బహూకరించిన విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. సర్పంచ్ నాళం టెరీషా, హెచ్‌ఎం డి.బాజా ఎస్ఎంసీ చైర్మన్ హెచ్ మనీషా, నాళం కాశీ, సునీల్, పసుపులేటి బుచ్చిరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు ఎంపీపీ శ్రీనివాసరాజు సూచించారు. శుక్రవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి వివరించారు. జాలిపూడి సర్పంచ్ నవ్య మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీటీసీ మండల సరస్వతి, ఎంపీడీవో శ్రీలత, తహసీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలపై ఏఐటీయూసీ పోరాటం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపైనా, ప్రైవేటీకరణ విధానాలపైనా ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు అన్నారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే అధ్యక్షతన శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడానికి కృషి చేస్తుందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆందోళనకు పూర్తి మద్దతు ఇస్తామన్నారు. ఈనెల 31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నవంబర్ 10న ఏలూరులో ప్రభుత్వ పాఠశాల ఆయాల రాష్ట్ర మహాసభను జరుగుతుందన్నారు. సమావేశంలో కంకిపాటి బుచ్చిబాబు, మన్నవ కృష్ణచైతన్య, కె.కృష్ణమాచార్యులు, తొర్లపాటి బాబు, చాట్ల పుల్లారావు, బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, భజంత్రి శ్రీనివాసరావు, డి.లక్ష్మణమూర్తి, కె.వసంతరావు పాల్గొన్నారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్ నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట (పంచారామాలు) ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు గంగాధరరావు తెలిపారు. పంచారామాలకు అల్ట్రా డీలక్స్ టిక్కెట్ ధర రూ.1100 ఉంటుందని చెప్పారు. ఈ బస్ సర్వీసులకు సర్వీస్‌నెంబర్ 98632తో ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు.

కార్తీకమాసంలో ప్రతి శుక్ర, ఆదివారాలలో రాత్రి 9 గంటలకు అన్నవరం వెళ్ళే భక్తుల కొరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణ నిమిత్తం ప్రతినెల పౌర్ణమికి రెండురోజుల ముందు జంగారెడ్డిగూడెం డిపో నుంచి రాత్రి 7 గంటలకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల దర్శన అనంతరం అరుణాచలం చేరుతుందని, పౌర్ణమి రోజున అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, దర్శన అనంతరం తిరిగి జంగారెడ్డిగూడెం వస్తుందని అన్నారు. టిక్కెట్ ధర రూ.2800 నిర్ణయించినట్లు తెలిపారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఉంగుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సీహెచ్.శ్రీధర్ కోరారు. నారాయణపురం హైస్కూలులో గురువారం రాత్రి జరిగిన మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు ఉనుముల రాంబాబు అధ్యక్షతన ఉంగుటూరు మండల మహా సభ జరిగింది. నవంబరులో ఏలూరులో జిల్లా మహా సభలు, జనవరిలో కాకినాడలో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శీతాల సత్యనారాయణ, అధ్యక్షుడిగా ఉనుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా డాకి జోగి నాయుడు, ఉపాధ్యక్షులుగా కత్తుల ఝాన్సీరాణి, తూతిక శివయ్య, కోశాధికారిగా ఊట ఆనందకుమార్, 11మంది జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సి.హెచ్.శ్రీధర్ ప్రకటించారు.

బెల్టు షాపులపై అధికారుల దాడి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు హెచ్చరించారు. మండలంలో పలు బెల్ట్‌షాపులపై శుక్రవారం దాడులు నిర్వహించారు. మైసన్నగూడెంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న కుక్కల రవిబాబు వద్ద పది మద్యం సీసాలు, పేరంపేటలో మరీదు వెంకట్ వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలులో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలి

భీమడోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్ళే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయాలని భీమడోలు వాసులు ఎంపీ మహేష్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కురెళ్ళగూడెం వచ్చిన ఎంపీకి జన్మభూమి, గౌతమి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో జూలై-2024 విద్యాసంవత్సరానికి డిగ్రీ, పీజీలలో దూర విద్య ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని సీఆర్ ఆర్ కళాశాల 'ఇగ్నో' స్టడీసెంటర్ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 31వతేదీలోగా 'ఇగ్నో' ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు పొందాలన్నారు.
- **ఏలూరు అర్బన్ :** గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు అవగాహన కలిగించేక్రమంలో జిల్లాలో ఎంపికచేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్‌లో రెండురోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది.
- **ఏలూరు టూటౌన్ :** ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలో ఆయుర్వేద వైద్యశిబిరం జరిగింది. డాక్టర్ లక్ష్మీసుభద్ర వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో శుక్రవారం కుంకుమార్చన చేశారు. మహిళలు సామూహికంగా లలితా పారాయణ నిర్వహించారు. సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చారు.
- **పెదపాడు :** జడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్. పరీక్షలకు హాజరవుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు తెలిపారు.
- పెదపాడు మండలంలో పశు గణన సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా మండల పశువైద్యాధికారి వాణిసంధ్యశ్రీ తెలిపారు.
- **ఉంగుటూరు :** ఈ నెల 29న ఏలూరులో రైతు సంఘం జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ కరపత్రాలు విడుదల చేశారు.
- ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో మంచినీటి బోరును మండల పరిషత్ నిధులతో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి శంకుస్థాపన చేశారు.
- **జీలుగుమిల్లి :** పి.అంకంపాలెం వీఆర్‌ఏ కట్టూరి దాసు మృతికి తహసీల్దారు బి.సందీప్, వీఆర్వో అశోక్, వీఆర్‌ఏ చంద్రశేఖర్, దుర్గారావు సంతాపం తెలిపారు.
- **ద్వారకాతిరుమల :** పంగిడిగూడెం జడ్పీహెచ్ పాఠశాలకు మోండలీజ్ సంస్థ 250 లీటర్ల సామర్థ్యం గల మంచినీటి శుద్ధి యంత్రాన్ని ఉచితంగా అందజేసింది.





లింగపాలెం, కామవరపుకోట, ఉంగుటూరులో పశు గణన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు జీలుగుమిల్లిలో అభివృద్ధి కార్యక్రమలు ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

సమస్యల పరిష్కారానికి కృషి

● మండలాల్లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు ● ప్రజలను కలిసిన ఎంపీ ● పశుగణనలో ప్రజాప్రతినిధులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కామవరపుకోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలపై 1079 వినతి పత్రాలను అందజేశారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండలంలో సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఘంటా సుధీర్ బాబు, కిలారు సత్యనారాయణ, కోనేరు వెంకట సుబ్బారావు, తూతా లక్ష్మణరావు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, సర్పంచ్‌లు గూడపాటి కేశవరావు, పసుమర్తి పార్థసారథిబాబు, వేముల నాగేశ్వరరావు, గోరింక దాసు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పశుగణన పోస్టర్లు ఆవిష్కరించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

చింతలపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. శుక్రవారం జరిగిన ఓటర్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో 20 శాతం మాత్రమే నమోదయ్యాయని, ఇంకా పది రోజులే గడువు ఉందన్నారు. 90 శాతం నమోదు కావాలని వివరించారు. సమావేశంలో జె.ముత్తారెడ్డి, దాసరి చంద్రశేషు, బీజేపీ నాయకులు విక్రమ్ కిశోర్, శ్రీనివాస్, మాటూరి వెంకట్రామయ్య, గుత్తా వెంకటేశ్వరరావు, డి.సత్యవరప్రసాద్, తహసీల్దార్ ప్రమద్వర, ఎంపీడీవో ఓటరు నమోదుపై సూచనలు ఇచ్చారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

లింగపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదలు, రైతులకు పశువులు ఆదాయ వనరు అని వాటిని లెక్కించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ అన్నారు. రంగాపురంలో సర్పంచ్ మునునూరి రాము ఆధ్వర్యంలో పశుగణన పోస్టర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. పశు పోషణకు అవసరమైన పథకాల అమలుకు పశుగణన ఉపయోగపడుతుందన్నారు. పశు సంవర్ధక శాఖ ఏడీ దొంతు కోటేశ్వరరావు, పి.చందు, కె.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి గ్రామంలో దుర్గమ్మతల్లి ఆలయంలో ఎంపీ పుట్టా మహేశ్ పూజలు చేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రహదారులు, కమ్యూనిటీ హాల్, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూజలు చేశారు. సర్పంచ్ మునునూరి రాము, గరిమళ్ల చలపతిరావు, కూరపాటి వెంకటేశ్వరరావు, శాఖమూడి శ్రీనివాసరావు, బొల్లినేని శ్రీనివాసరావు, పుల్లారావు, సుసాని శ్రీనివాసరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతు సహకరించాలి

ఉంగుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశుగణనతో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ప్రతి రైతు సహకరించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశువైద్యాధికారుల సమక్షంలో పశుగణన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంచాలకులు నాయక్, నిడమర్రు, ఉంగుటూరు మండలాల పశువైద్యాధికారులు శిరీష, కిశోర్, అశోక్, సందీప్ సిబ్బంది పాల్గొన్నారు.

టి.గంగన్నగూడెంలో పల్లె పండుగ

జీలుగుమిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. టి.గంగన్నగూడెం పంచాయతీ దిబ్బగూడెంలో సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పంచాయితీలో సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో దిబ్బగూడెంలో డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, పంచాయితీ రాజ్ డీఈ సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలకు తక్షణ పరిష్కారం

ఏలూరు టూటౌన్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల తక్షణ పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చంటి మాట్లాడుతూ ఎవరైన ఎటువంటి సమస్యలున్న ఏ సమయంలోనైనా తన వద్దకు రావచ్చునన్నారు. సమస్య పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించమని ఆదేశాలు జారీ చేశారు. పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, శివప్రసాద్, బెల్లకొండ కిషోర్, అమరావతి అశోక్ పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తి
వాడవల్లి కీర్తి









స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగ ధనులుగా ప్రజల హృదయాల్లో నిలిచిన మహనీయులను ఆ గ్రామం గుండెల్లో పెట్టుకుంది. వారి విగ్రహాలను గ్రామంలో ఏర్పాటు చేసి యువకుల్లో పోరాటస్ఫూర్తిని నింపారు. ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామంలో పలువురు పోరాట యోధుల విగ్రహాలను గ్రామస్థులు ఏర్పాటు చేశారు. 70 సంవత్సరాల క్రితమే గ్రామ ప్రముఖుడు కాశీనాథుని కుమారేశ్వరరావు సంకల్పంతో గ్రామస్థులు పలువురు చొరవ తీసుకుని విరాళాలు సేకరించి మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలతో పాటు, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే రోజున గ్రామస్థులు ఐక్యతా ప్రదర్శన నిర్వహించి వారికి నివాళులర్పిస్తుంటారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మహనీయుల విగ్రహాలను తొలిసారిగా ఒకే రోజున ఏర్పాటు చేసిన ఘనత వాడవల్లి గ్రామానికి దక్కిందని చెప్పవచ్చు.

-ముదినేపల్లి

వాడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు వల్లభాయి పటేల్, టంగుటూరి ప్రకాశం పంతులు జవహర్ లాల్ నెహ్రూ , సుభాష్ చంద్రబోస్ ,మహాత్మాగాంధీ విగ్రహాలు

త్వరలో మెస్ సమస్యకు
పరిష్కారం

- విద్యార్థులకు యూనిఫాం, ల్యాప్‌టాప్‌లు అందిస్తాం
- టిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్



ఇంటర్వ్యూ..

నూజివీడు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్ సమస్యను అతిత్వరలో పరిష్కరించే ందుకు చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వివరించారు.

ఆంధ్రజ్యోతి: నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నూతన మెస్ టెండర్లను దసరా సెలవుల్లో ఖరారు చేస్తామని చెప్పారు. నూతన మెస్‌ల ఏర్పాటు ఎంతవరకు వచ్చింది?

డైరెక్టర్: నాసిరకపు భోజనం అందిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో నూతనంగా మెస్ నిర్వాహకులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అయితే దీనికి సంబంధించి మెనూను విద్యార్థుల సూచనల మేరకే రూపొందించటం జరిగింది. నూతన మెనూ ప్రకారం మెస్ రేట్లను ఖరారు చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదించగా, ఫుడ్‌సేఫ్టీ అధికారుల ద్వారా మెస్ ధరల నిర్ణయానికి చర్యలు చేపట్టారు. ధరలు నిర్ణయం తర్వాత టెండర్లు పిలుస్తాం.

ఆంధ్రజ్యోతి: ఫుడ్‌కోర్టు నిర్వహణపై మెప్మాతో ఎంవోయు కుదుర్చుకున్నట్టున్నారు?

డైరెక్టర్: ఫుడ్‌కోర్టు కాంట్రాక్ట్ ముగిసింది. ఈ నేపథ్యంలో ఫుడ్‌కోర్టుతో పాటు క్యాంపస్‌లోని వివిధ దుకాణాల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించాలని త్రిమెన్‌కమిటీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఫుడ్‌కోర్టు, ఇతర దుకాణాలను నూజివీడు మునిసిపల్ కమిషనర్ ద్వారా మెప్మా (పట్టణ మహిళా సమాఖ్య)కు అప్పగించటం జరిగింది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, యూనిఫాంలు ఇప్పటికి అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి?

డైరెక్టర్: ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ల్యాప్‌టాప్, యూనిఫాం తదితరాలను కొనుగోలు చేసేందుకు టెండర్లను పిలవాల్సి ఉం ది. అయితే గతంలో పనిచేసిన అధికారులు టెండర్లను పిలువకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత రెండుసంవత్సరాలుగా విద్యార్థులకు నూతన ల్యాప్‌టాప్‌లు, యూనిఫాంలు కొనుగో లు చేయలేదు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించాం. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: నూజివీడు పట్టణంలో ట్రిపుల్ ఐటీ నుంచి వచ్చే మురుగునీటి సమస్య ఇబ్బందిగా ఉంది. ప్రధానంగా గొడుగువారిగూడెంలోని వ్యవసాయ భూములు, మురుగునీటి వల్ల ఇబ్బం ది ఎదురవుతోంది.

డైరెక్టర్: ట్రిపుల్ ఐటీ నుంచి వచ్చే మురుగు నీటిని ఎస్‌టీపీ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయటం జరుగుతోంది. అయితే సదరు నీటిని తరలించేందుకు 2009లో ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణానికి రూ.52 లక్షలను నూజివీడు మునిసిపాలిటీలో అడ్వాన్స్‌గా చెల్లించాం. అది నేటికి ఆచరణలోకి రాలేదు. ఇటీవల 5 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ నిర్మించేందుకు మూడున్నర కోట్లతో మునిసిపల్ అధికారులు అంచనాలు వేశారు. త్వరలో టెండర్లు పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

భీమేశ్వరస్వామి దర్శనం నిలిపివేత



భీమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భీమవరం టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భీమవరం భీమేశ్వరస్వామి గర్భాలయంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం నుంచి 30 వతేదీవరకు దర్శనాలను నిలిపి వేసినట్టు ఈవో తోట శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం కాళ్ళకూరుకు చెందిన పుల్లేటికుర్తి చిన్నా ఆధ్వర్యంలో కళాపకర్షణ కార్యక్రమాలను నిర్వ హించారు. విఘ్నేశ్వర పూజ మండపరాధన, ప్రధాన కలశారాధన, హోమాలను నిర్వ హించి స్వామివారి కళలు కలశంలో నిక్షిప్తం చేశారు. అనంతరం కలశాన్ని ఆలయంలోని మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో ఉంచారు. ఐదురోజులు పాటు అక్కడే స్వామివారికి పూజలు నిర్వహిస్తారు. గర్భాలయంలో మరమ్మతులు పూర్తియిన తరువాత 30న స్వామివారికి కల్యాణ్యాసం చేసిన తరువాత భక్తులకు దర్శనం కల్పిస్తారు.

మార్టేరులో నేడు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

పెనుమంట్ర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) మార్టేరులో నేటి నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రీ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్‌వీజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్ 19 పోటీలు జరుగుతాయన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డీఈవో నారాయణ తదితరులు పాల్గొంటారని చెప్పారు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు విచ్చేశారన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు అల్లూరు విద్యార్థిని ఆశ్లేష



ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు జడ్పీ హైస్కూల్ లో టెన్త్ విద్యార్థిని నీలిపల్లి ఆశ్లేష స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి లో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో ఈ నెల 23న జరిగిన అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో తన సత్తా చాటిన ఆశ్లేషను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 27 నుంచి అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 కబడ్డీ పోటీల్లో ఆమె ఉమ్మడి కృష్ణా జిల్లా తరపున పాల్గొం టుందని హైస్కూల్ హెచ్‌ఎం శాంతి రామోజీ తెలిపారు. ఆశ్లేషను స్కూల్ కమిటీ చైర్మన్ శ్యామల, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న12 ట్రాక్టర్ల పట్టివేత

ముసునూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలసపల్లి ఉచిత ఇసుక రీచ్ నుంచి గురువారం రాత్రి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై ముసునూరు పోలీసులు పట్టుకున్నారు. వలసపల్లి, అన్నవరం, మిట్టగూడెం, చెక్కపల్లి, సూరేపల్లి గ్రామాలకు చెందిన 12 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వీటిని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తమశర్మకు రిఫర్ చేసినట్లు చెప్పారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ. 2 వేలు చొప్పున 12 ట్రాక్టర్లకు రూ. 24 వేలు జరిమానా విధించి, వదిలివేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఉచిత ఇసుక రీచ్‌ల్లో ఇసుకను రవాణా చేసుకోవాలని ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వం ప్రజా అవసరాల కోసం ఉచితంగా ఇసుకను అందజేస్తుందని, ఈ ముసుగులో అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలతోపాటు భారీ జరిమానా విధిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

రేపు చెక్కపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం

ముసునూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లిలో ఉన్న నడయానా మోనస్ట్రీలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకుడు జంపాల సత్యనారాయణరాజు తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, ఫిజియోథెరపీ, మానసిక వైద్యులు పరీక్షలు చేస్తారని తెలిపారు. అలాగే జనరల్ మెడిసిన్, కంటి, ఎముకలు, కీళ్ళు, చెవి, ముక్కు, గొంతు, దంత, గుండె, క్యాన్సర్, చిన్న పిల్లల, ఊపిరితిత్తుల, గ్యాస్ట్రో ఎంటరాలజీ, మానసిక, చర్మవ్యాధుల, నిపుణులు, స్త్రీ సంబంధిత వ్యాధుల వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1 నుంచి 3 వరకు ఉచిత వైద్యశిబిరాలు

ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ముదినేపల్లికి చెందిన ఈడ్పుగంటి వెంకట్రామయ్య జ్ఞాపకార్థం ఈవీఆర్ చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవంబరు 1 నుంచి 3 వరకు మూడు రోజులపాటు ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్ తెలిపారు. గుడివాడలోని ఈవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించే ఈ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు హాస్పటల్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తామని అన్ని రకాల సర్జరీలు ఉచితమని, కంటి శుక్లాల తొలగింపు, కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



గ్రామసభలో 50 అర్జీలు

కలిదిండి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆవకూరులో శుక్రవారం నిర్వహించిన భూ రీ సర్వే రెవెన్యూ గ్రామసభకు 50 మంది రైతులు అర్జీలు సమర్పించారని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సర్పంచ్ నరహరశెట్టి నరసయ్య, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ మహమ్మద్ షమి, వీఆర్వో కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో రీ సర్వే గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. వాడవల్లి, ఊటుకూరు, కాకరవాడ గ్రామాల్లో తహసీల్దార్ సుబానీ నిర్వహించిన గ్రామ సభల్లో జాయింట్ ఎల్‌పీలు విభజన భూముల సబ్ డివిజన్‌లు కోరుతూ 79 మంది రైతులు అర్జీలను అందజేశారు. రైతుల నుంచి మరో 15 రోజులపాటు అర్జీలను తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, రీ సర్వే డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి గ్రామసభల్లో పాల్గొన్నారు.

డ్రైవర్‌కు జైలు, జరిమానా

నూజివీడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వాహనాన్ని అతివేగంగా నడిపి ఒకరి మృతికి, మరొకరు గాయపడడానికి కారణమైన వాహన చోదకుడికి 3 నెలల జైలు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి తీర్పు చెప్పారు. 2018, జనవరి 20న పెదపాడు మండలం పెదారవీడుకు చెందిన జాక్విన్, భాను తేలప్రోలుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కృష్ణాజిల్లా బాపులపాడు మండలం, ఆరుగొలను వద్ద వీరిని బొలేరో వాహనం బలంగా ఢీకొంది. జాక్విన్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, భానుకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని నూజివీడు కోర్టులో హాజరుపర్చగా ప్రత్యేక న్యాయమూర్తి మూడు నెలల జైలు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



వెలమపేట యూపీ స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలా?

పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కైకలూరు వెలమపేట యూపీ స్కూల్ పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటును స్థానిక మహిళలు అడ్డుకున్నారు. స్కూల్ పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పెద్దసంఖ్యలో వెలమపేట మహిళలు ఆ ప్రదేశంలో ఆందోళనకు దిగారు. దీనివల్ల విద్యార్థులకు ప్రాణహాని ఉంటుందని భయాందోళనలు వ్యక్తం చేశారు. విషయాన్ని వారు సర్పంచ్ మేరీ నవరత్న కుమారికి తెలపడంతో ఆమె వచ్చి వేరే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించడంతో అధికారులు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వాలు చేయించాలి



కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదును రికార్డు స్థాయిలో నిర్వహించి సీఎం చంద్ర బాబు పాలనా దక్షతకు నిదర్శనంగా నిలపాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు కోరారు. శుక్రవారం కైకలూరులో నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వాల నమోదులో కైకలూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలన్నారు. రాష్ట్రంలో మరుగునపడిన అభివృద్ధిని సాధించేందుకు చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభం కానున్న పార్టీ సభ్యత్వాల నమోదును పార్టీ శ్రేణులంతా విజయవంతం చేసి టీడీపీని మరింత బలోపేతం చేయాలన్నారు. టీడీపీ నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, బలే ఏసురాజు, పోసిన పాండురంగారావు, కోట కోటిలింగంబాబు, కంచర్ల రామకృష్ణ, మారగాని కొండా, జయమంగళ సుబ్బరాజు, పడమట వాసు, ఓగిరాల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఏడీఏ

ప్రకృతి వ్యవసాయమే మేలు

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక వరి దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ఏడీఏ లలితాసుధ తెలిపారు. శుక్రవారం వింజరంలో రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యవసాయ శాఖ ఏడీఏ ఆర్. గంగాధరరావు వరిపై సస్యరక్షణ విధానాలు సూచించారు. ఏవో దివ్య ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ నాగమణి, వీఏఏలు పాల్గొన్నారు.



దీటీకి వినతిపత్రం ఇస్తున్న పాఠశాల పారిశుధ్య కార్మికులు

జీతం బకాయిలివ్వాలి

ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు తమ జీతం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.విజయ లక్ష్మీ ఆధ్వర్యంలో తహసీల్దార్, మండల పరిషత్ అధికారులు, ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు.



గ్రోవెల్ సహకారంతో మట్టి దిబ్బల తొలగింపు

ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం - భీమవరం స్టేట్ హైవేలో పెదగొన్నూరు పంచాయతీ పరిధిలోని రహదారి కిరుపక్కలా మట్టి దిబ్బలను తొలగించారు. సింగరాయపాలెం గ్రోవెల్ ఫీడ్స్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో మట్టి దిబ్బల తొలగింపుతోపాటు పెద్ద ఎత్తున పెరిగిన ముళ్ల చెట్ల తొలగింపు పనులను సర్పంచ్ తాడంకి శిరీష, పంచాయతీ కార్యదర్శి గిరిజ, ఎన్‌డీఏ నాయకులు గుడివాడ వేణు, తాడంకి రాజేష్, నాగిరెడ్డి శివ ప్రసాద్, గుడిసేవ సురేష్ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు ఆటంకాలు తొలగాయి.



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్

పశుగణనకు సహకరించాలి

ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పశుగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదినేపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్ కోరారు. శుక్రవారం ఆయన ముదినేపల్లి ప్రభుత్వ వైద్యశాల వద్ద 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఆ శాఖ సిబ్బంది, పశుపోషకులతో కలసి ఆవిష్కరించి మాట్లాడుతూ పశుగననకు రైతులు సహకరించాలని కోరారు. ఆసుపత్రుల అభివృద్ధికి, మందుల సరఫరాకు, ప్రభుత్వ రాయితీలకు ఈ పశుగణన ఉపకరిస్తుందని తెలిపారు. ఎన్యూమరేటర్లు పశుగణన నిర్వహిస్తారని తెలిపారు.

56 మందికి ఉద్యోగాలు

నూజివీడు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. 109 మంది అభ్యర్థులు హాజరు కాగా వివిధ కంపెనీల్లో 56 మంది ఉద్యోగాలు పొందినట్టు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సి.మధుభూషణ్ తెలిపారు.

సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలు

నూజివీడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అడిగిన ప్రతి రైతుకు బిందు సేద్యం పరికరాలను ఇచ్చేందుకు రైతు సేవా కేంద్రం సిబ్బంది చర్యలు తీసుకోవాలని, ఏలూరు జిల్లా సూక్ష్మ సేద్యం ప్రాజెక్టు డైరెక్టర్ పి.రవికుమార్ అన్నారు. నూజివీడు మండలం తుక్కులూరు రైతు సేవా కేంద్రంలో రైతులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై ఐదెకరాలు పైబడిన రైతులకు 50 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలను ఇస్తామన్నారు. నూజివీడు మండలంలో 800 ఎకరాల్లో పరికరాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. నూజివీడు మండల ఉద్యాన శాఖ అధికారిణి ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ముసునూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముసునూరు పంచాయతీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ కొండేటి విజయ లక్ష్మి యిర్మియా అన్నారు. శుక్రవారం బీసీ కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో అంతర్గత, సీసీ రహదారులకు ఇరువైపుల ఉన్న డ్రెయినేజీల్లో పూడిక తొలగించారు. అలాగే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై గల డ్రెయినేజీలో పూడిక తీశారు. ఉప సర్పంచ్ తోట శ్రీను, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను తదితరులు పర్యవేక్షించారు.



సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

నూజివీడు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆస్పత్రి ఖర్చు భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం వారిని సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో నూజివీడు మండలం లయన్ తండాకు చెందిన బాణావతు తులసీరామ్‌కు రూ.15 వేలు, బాణావతు లక్ష్మికి రూ.25 వేలు చెక్కును అందించారు. టీడీపీ గ్రామ నాయకులు బాణావతు నాగమణి, వడిత్యా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు హరిస్తున్న సారా

ఆగిరిపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలంలో సారా ఏరులై పారుతోంది. ఆగిరిపల్లి స్టేట్ బ్యాంక్ నుంచి రామాలయం వరకు ఉన్న ప్రాంతం నిత్యం మందుబాబులతో రద్దీగా ఉంటుంది. శుక్రవారం ఉదయం గంగానమ్మ మర్రిచెట్ల వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉండగా సమీప ప్రాంత వాసులను వాకబు చేయగా సారా తాగి మరణించినట్టు తెలిపా రు. ఆ వ్యక్తి సింగన్నగూడెంకు చెందిన పటా పంచల గోపాలకృష్ణ(35)గా గుర్తించారు. గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయ కుండా అతని మృతదేహాన్ని తీసుకువెళ్ళినట్లు సమాచారం. ఇదిలావుండగా సాయంత్రానికి అదే ప్రాంతంలో మరో వ్యక్తి పీకల వరకు తాగి ఒళ్ళు తెలియకుండా పడిపోయి కనిపించాడు. ఇకనైనా స్థానిక పోలీస్‌లు గట్టి నిఘా పెట్టి వీటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పశు గణనకు శ్రీకారం

ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలతో పాటు వీధి కుక్కల వివరాలు సైతం నమోదు

మండవల్లి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు సంతతి అభివృద్ధికి ఐదేళ్ళకోసారి నిర్వహించే అఖిల భారత పశుగణన చేపట్టేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంది. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పశువులను లెక్కించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు జరుగుతుంది. నియోజకవర్గంలోని 110 పంచాయతీల రైతుల వద్ద ఉన్న ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు, కుందేళ్లు, గుర్రాలు, గాడిదలు, కోళ్లను ఇంటింటికి వెళ్లి లెక్కించనున్నారు. వీటితో పాటు విచ్చలవిడిగా వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు, ఆవులు, మేకలు వివరాలను సైతం నమోదు చేస్తారు. పశుగణన వల్ల వ్యాధి నియంత్రణ, పశువుల ఆరోగ్యంపై నిఘా, బ్రీడు డైనమిక్స్ అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపయుక్తం. అంతేకాక పశుసంవర్ధక శాఖలో వివిధ పథకాలు మరియు కార్యక్రమాల అమలుకు ఉపయోగం అంటున్నారు అధికారులు.

గణనకు సిబ్బంది సిద్ధం

మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో పశు గణనకు కావాల్సిన 26 మంది ఎన్యూమరేటర్లు, ఐదుగురు సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేశాం. కార్యక్రమానికి అవసరమైన సామగ్రిని క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాలకు చేరవేశాం.



భారత ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి పశు యజమా నులంతా సహకరించి ఇంటి వద్దకు వచ్చే అధికారులకు పశువుల వివరా లను తెలియజేయాలి.

-వరప్రసాద్, పశుసంవర్ధక శాఖ ఏ.డి.